PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA


తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 32 | పేజీలు : 8 | గురువారం 25 జూన్ 2026 | వెల : 4/-




## రైతుల చెంతకే విత్తనాలు

- రైతు వేదికల వద్ద అందుబాటులోకి
- పంటల సాగు ప్రణాళికకు అనుగుణంగా మూడు స్థాయిల్లో(గ్రామ, మండల, జిల్లా) విత్తనాల నిల్వ, పంపిణీకి సంబంధించి ప్రభుత్వం చర్యలు
- సన్న రకాల్లో అవసరం 9.54 లక్షల క్వింటాళ్లు, లభ్యత 15.64 లక్షలు
- ఇతర పంటల్లోనూ రెట్టింపు నిల్వలు
- పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు



హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావ పరిస్థితుల దృష్ట్యా వర్షాకాల సీజన్‌లో పంటల మార్పిడికి అన్నదాతలకు అవసరమైన మేరకు విత్తనాలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పంటల సాగు ప్రణాళికకు అనుగుణంగా మూడు స్థాయిల్లో(గ్రామ, మండల, జిల్లా) విత్తనాల నిల్వ, పంపిణీకి సంబంధించి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా వరి సాగులో గతంలో మాదిరికాకుండా 7 సన్న రకాలకు మాత్రమే బోనస్‌ను ఇవ్వాలని నిర్ణయించిన సర్కారు వాటి సాగు లక్ష్యాన్ని కూడా నిర్దేశించింది. - మిగతా3లో

## సామాన్య ప్రజలపై పిడుగు

### సన్నబియ్యంకు రెక్కలు.. 20 శాతం పెరిగిన ధరలు!

- సన్నబియ్యం ధరలు ఇరవై రోజుల్లో 15 నుంచి 20 శాతం పైపైకి
- వివిధ రాష్ట్రాల్లో తగ్గిన ధాన్యం లభ్యత
- ఎల్‌నినో నేపథ్యంలో మిల్లర్ల అక్రమ నిల్వతో మరింత ధరలు
- ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తెలంగాణ సన్నబియ్యం



హైదరాబాద్

గ్యాస్, ఇంధన, నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో లబోదిబో మంటున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఇప్పుడు మరో పిడుగు పడింది. అదే సన్నబియ్యం. గడిచిన ఇరవై రోజుల్లో వీటి ధర ఏకంగా 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు మిల్లర్లు, బియ్యం వ్యాపారులు చెబుతున్నారు. - మిగతా3లో



## విద్యార్థులను ఉగ్రవాదులంటారా?

- వెంటనే రాజీనామా చేయాల్సిందే'
- ధర్మేంద్ర ప్రధాన్‌పై ఖర్గే ఫైర్
- నీట్ పేపర్ లీక్ నిరసనలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపణ
- విద్యార్థుల గొంతును అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రంపై విమర్శలు

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం



- స్వయంగా లేఖ రాసిన ఇరాన్ అధ్యక్షుడు!
- ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం!
- అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసిన వైనం
- జులై 4 నుంచి అంత్యక్రియల కార్యక్రమాలు
- జులై 9న మష్హాద్‌లో ఖననం

## ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?

- ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం
- రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ వెకేషన్ బెంచ్ ఆదేశాలు





## మోదీ కేబినెట్‌లో భారీ మార్పులు?

- త్వరలోనే భారీ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు జాతీయ రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం
- ంద్ర కేబినెట్‌లో మార్పులు, చేర్పులపై బీజేపీ అధిష్ఠానం అంతర్గతంగా విస్తృత కసరత్తు చేస్తున్నట్లు సమాచారం
- మరికొందరు మంత్రులను కూడా రాజీనామా చేయాలని పార్టీ నాయకత్వం కోరే అవకాశముందన్న ఊహాగానాలు
- కేంద్ర మంత్రివర్గంలో దాదాపు 38 మంది మంత్రుల బాధ్యతల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని ప్రచారం

## నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు

### ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక

- కాంగ్రెస్ నేతలకు రేవంత్ అల్టిమేటం!
- పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోం
- ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలి
- ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉంది
- ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉంది



హైదరాబాద్

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ కాంగ్రెస్‌లో అలసత్వం కనిపిస్తోందా? క్షేత్రస్థాయిలో పార్టీ నేతలు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదా? ఈ ప్రశ్నలకు తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే బలం చేకూరుస్తున్నాయి. ఎస్ఐఆర్ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని స్పష్టం చేసిన ఆయన.. పార్టీ ఆదేశాలను పట్టించుకోని నేతలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైదరాబాద్‌లో బుధవారం - మిగతా3లో



## కొత్త సీఎస్‌గా సంజయ్!

- తదుపరి ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌జాజు ఖరారయ్యే అవకాశం
- ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శి
- సంజయ్ జాజును తిరిగి తెలంగాణ రాష్ట్రానికి పంపుతూకీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
- కొత్త ప్రధాన కార్యదర్శి రేసులో జయేశ్ రంజన్‌తో పాటు సంజయ్‌జాజ పేర్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి..
- చివరకు జాజు వైపే మొగ్గు చూపినట్లు సమాచారం



## రౌడీషీట్ లేకుంటే నేనూ లీడరే

- బల్దియా ఎన్నికలపైనే అందరి దృష్టి
- పోలీసులు, రాజకీయ నేతలను ఆశ్రయిస్తున్న నేరస్థులు
- రౌడీషీట్‌ను తొలగించుకునేందుకు నానాతంటాలు
- రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్ టికెట్ కోసం వ్యూహాలు
- తమ బలాబలాలు చాటుకునేందుకు స్థానికంగా యువతను చేరదీస్తున్న తీరు

హైదరాబాద్

డబ్బులకు ఇబ్బంది లేదు. లోకల్ పలుకుబడి ఉండటంతో రాజకీయంగా వెలిగి పోవాలని ఆశ పుడుతోంది. అయితే అడ్డంకులుగా వెంటాడుతున్న పాత కేసులు స్థానికంగా రౌడీషీటర్ అనే పేరుతో తీవ్రంగా వేధిస్తోంది. త్వరలోనే హైదరాబాద్‌లోని - మిగతా3లో



నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
25 జూన్ 2026

# ‘విద్యార్థులను ఉగ్రవాదులంటారా?

నీట్ పేపర్ లీక్?కు సంబంధించి విద్యార్థులు చేపట్టిన నిరసనలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రచర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై, విద్యాశాఖ మంత్రిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రశ్నించే వారిని ఉగ్రవాదులుగా ముద్ర వేస్తోందని ఆరోపించారు.

ఎక్స్‌లో స్పందించిన ఖర్గే, కేంద్ర ప్రభుత్వ హయాంలో అనేక పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. “90 పేపర్ లీక్‌లు జరిగాయి. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింది. నీట్ పేపర్ లీక్ ఘటనతో 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎన్నో కుటుంబాలు తీవ్ర వేదనను అనుభవిస్తున్నాయి. అయినా విద్యాశాఖ మంత్రి తన పదవిని అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా, విద్యార్థుల గొంతును ఉగ్రవాదుల గొంతుగా అభివర్ణిస్తున్నారు” అని ఖర్గే విమర్శించారు.

**విద్యార్థుల విషయంలోనూ అదే ధోరణి: ఖర్గే**

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడం బీజేపీ నేతలకు అలవాటైందని కూడా ఆయన ఆరోపించారు. గతంలో రైతుల ఉద్యమాల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతులను ఆందోళన జీవులు, పరాన్న జీవులు అంటూ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఇప్పుడు విద్యార్థుల విషయంలోనూ అదే ధోరణి కొనసాగుతోందని అన్నారు. “విద్యార్థుల స్వరం దేశవ్యాప్తంగా మరింత బలంగా వినిపిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే”



అంటూ ఖర్గే డిమాండ్ చేశారు. ఇదే అంశంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా మండిపడ్డారు. జంతర్ మంతర్‌లో విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనల సందర్భంగా విద్యాశాఖ మంత్రి వారిని ఉగ్రవాదుల బీ-టీమ్‌గా అభివర్ణించారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌ను కూడా ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. “విద్యార్థుల ఆత్మహత్యలకు న్యాయం చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. అలాంటి మమ్మల్ని ఉగ్రవాదుల బీ-టీమ్ అంటున్నారు. దేశ యువతను ఉగ్రవాదులుగా పిలిచే హక్కు ఎవరికీ లేదు. మేము ఉగ్రవాదులు కాదు. దేశభక్తి సర్టిఫికెట్లు మీలాంటి వారి నుంచి మాకు అవసరం లేదు” అని దీప్కే తీవ్రంగా స్పందించారు. మరో పోస్టులో ఆయన మరింత ఘాటుగా స్పందించారు. “మమ్మల్ని ఉగ్రవాదులంటున్నారు. కానీ విద్యార్థుల మరణాలకు బాధ్యత వహించాల్సింది ఎవరో దేశ ప్రజలకు తెలుసు” అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో జంతర్‌మంతర్ వద్ద తన రాజీనామా కోరుతూ జరుగుతున్న నిరసనలపై స్పందించారు. ప్రజాస్వామ్యంలో తిరస్కరణకు గురైన కొన్ని శక్తులు మారువేషంలో వచ్చి వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. దేశాన్ని విభజించాలనుకునే వారి కోసం నినాదాలు చేస్తున్నవారే ఈ నిరసనల వెనుక ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలే ప్రస్తుతం వివాదానికి కేంద్రబిందువయ్యాయి.

**ఎంతటి అహంకారానికి నిదర్శనం?: కేజ్రీవాల్**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై కేంద్ర మంత్రిని విమర్శించారు. “పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న అమాయక విద్యార్థులు దేశాన్ని విభజించాలనుకుంటున్నారా? వారి భవిష్యత్తును నాశనం చేస్తూ దేశాన్ని కాపాడుతున్నామని చెప్పడం ఎంతటి అహంకారానికి నిదర్శనం?” అంటూ ఎక్స్‌లో ప్రశ్నించారు. కాగా, నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ వివాదం మధ్యే జూన్ 21న నిర్వహించిన రీ-ఎగ్జామినేషన్ దేశవ్యాప్తంగా, అలాగే విదేశాల్లోని 14 కేంద్రాల్లో పూర్తైంది. అయితే పరీక్షల నిర్వహణ, పారదర్శకత, విద్యార్థుల భవిష్యత్తుపై ఇంకా అనేక ప్రశ్నలు మిగిలే ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ అంశం ఇప్పుడు కేవలం పరీక్షల పరిమితిని దాటి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది.

# మోదీ కేబినెట్‌లో భారీ మార్పులు?

**న్యూఢిల్లీ:** కేంద్ర మంత్రివర్గంలో త్వరలోనే భారీ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు జాతీయ రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో మార్పులు, చేర్పులపై బీజేపీ అధిష్ఠానం అంతర్గతంగా విస్తృత కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో మరికొందరు మంత్రులను కూడా రాజీనామా చేయాలని పార్టీ నాయకత్వం కోరే అవకాశముందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సమాచారం మేరకు.. కేంద్ర మంత్రివర్గంలో దాదాపు 38 మంది మంత్రుల బాధ్యతల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు ఉద్వాసన పలుకుతూ, ఎన్నికల దృష్ట్యా కీలక రాష్ట్రాలకు చెందిన ఎంపీలకు మంత్రి పదవులు కట్టబెట్టే వ్యూహాన్ని బీజేపీ అమలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో పంజాబ్, యూపీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెంచే దిశగా నిర్ణయాలు ఉండొచ్చని తెలుస్తోంది. అలాగే మోదీ కేబినెట్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న కొందరు సీనియర్ మంత్రులను తప్పించి, యువతకు, ముఖ్యంగా జెన్-జీ తరం నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. యువ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో కొత్త తరానికి చెందిన నాయకులను మంత్రివర్గంలోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి పదవుల రేసులో పలు పేర్లు వినిపిస్తున్నాయి. శ్రీకాంత్ షిండే, ఈటల రాజేందర్, డీకే



అరుణ, కకోలీ ఘోష్, తదితర నేతలకు అవకాశాలు ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ నుంచి కూడా పలు కీలక మార్పులు ఉండొచ్చని సమాచారం. ఇక ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన ఎంపీలకు(రాఘవ్ చద్దా, టీఎంసీ నుంచి పలువురు, మహారాష్ట్ర నుంచి కొందరు) కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యత ఇచ్చే దిశగా చర్చలు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

గతంలో మోదీ 2.0 ప్రభుత్వ హయాంలో జరిగిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో 12 మంది మంత్రులు రాజీనామా చేయగా, పలువురికి పదోన్నతులు లభించాయి. దాదాపు 30 మంది కొత్త వారికి మంత్రివర్గంలో చోటు దక్కింది. అదే తరహాలో ఈసారి కూడా భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం లేదా బీజేపీ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారాలపై ఆసక్తి నెలకొంది. రాజకీయంగా కీలకమైన రాష్ట్ర ఎన్నికల ముందు జరిగే ఈ పునర్వ్యవస్థీకరణ దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీయనుంది.

# భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

**ముంబై :** ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరి, ఇంధన, వాణిజ్య సంక్షోభం తలెత్తేలా కనిపించింది. కానీ తాజాగా అమెరికా- ఇరాన్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంతో చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి77.39 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతుంటే.. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి73.57 వద్ద ట్రేడ్ అవుతోంది.అయితే ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో, ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అవసరానికి మించి పెరిగిపోతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్ కంటే చాలా వేగంగా పెరుగుతుందని, తద్వారా 2027 నాటికి చమురు మిగులు ఏర్పడుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో జరిగిన యుద్ధం కారణంగా రోజుకు 14 మిలియన్ బ్యారెళ్ల (ఎజూట) చమురు ఉత్పత్తి నిలిచిపోయిందని ఎఇం అంచనా వేసింది.క్రిస్టల్ ఎనర్జీ గ్లోబల్ అడ్వైజర్ క్రిస్టాఫ్ రూహ్ల్ అభిప్రాయం ప్రకారం.. 2027 నాటికి ప్రపంచ సరఫరా, డిమాండ్ కంటే రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని గేట్‌వే హౌస్‌లో ఎనర్జీ, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కనెక్టివిటీ సీనియర్ ఫెలో అమిత్ భండారీ తెలిపారు. అయితే ఈ తగ్గదల అనేది తక్షణమే ఉండకోవచ్చని.. దానికి దాదాపు 5-6 నెలల సమయం పడుతుందన్నారు.అంతేకాదు రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన మార్కెట్లలో భారీ మార్పులు రాబోతున్నాయని నిపుణులు అంటున్నారు. 2027 నాటికి ప్రపంచ చమురు సరఫరా రోజుకు సుమారు 8 మిలియన్




బ్యారెళ్లు పెరుగుతుందని, కానీ డిమాండ్ కేవలం 2 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారీ ఎత్తున చమురు మిగులు ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తోందని.. ఇది ధరలను తగ్గించడమే కాకుండా.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఏర్పడి కొరతను ఫుల్‌ఫిల్ చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. అమెరికా-ఇరాన్ ఒప్పందం ఇలాగే కొనసాగితే గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు క్రమంగా పుంజుకుంటాయని ఎఇం భావిస్తోంది. శాశ్వత ఒప్పందం కుదిరి, ఇరాన్ ఎగుమతులపై ఆంక్షలు తొలగిపోతే, మరింత ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తుంది. ఇది సరఫరాను మరింత మెరుగుపరిచి, చమురు ధరలపై ఉన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొంది

## ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా..?

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి పేరు తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్ ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీచేసింది.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీని ఇరాన్ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌కు సుప్రీం లీడర్‌గా సేవలందించారు. అంత్యక్రియలకు కోట్ల సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తరఫున కూడా ప్రతినిధి బృందం హాజరుకానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ అధ్యక్షుడు తనను కూడా ఆహ్వానించారని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు.

## పాకిస్థాన్ గగనక్షేత్రంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం



**న్యూఢిల్లీ:** ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ-321 ఢిల్లీ- అమృత్‌సర్ విమానం.. పాకిస్థాన్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది. సోమవారం రాత్రి 9.18 నిమిషాలకు ఢిల్లీ నుంచి ఆ విమానం టేకాఫ్ తీసుకున్నది. అయితే అమృత్‌సర్‌లో 10.30 నిమిషాలకు ఆ విమానం ల్యాండ్ కావాలి. కానీ అనుకోకుండా ఆ విమానం పాక్ ఎయిర్‌స్పేస్‌లోకి ఎంటరైంది. ఆ సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు శ్రీ గురు రామ్ దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మేనేజింగ్ అధికారి తెలిపారు. స్థానిక ఎయిర్ పోర్టు కంట్రోల్ రూమ్ ఆదేశాలతో ఆ విమానం ఢిల్లీకి తిరిగి వచ్చేసింది. మళ్లీ రెండు గంటల వ్యవధి తర్వాత టేకాఫ్ తీసుకుని ఆ రోజు రాత్రి 2.20 నిమిషాలకు అమృత్‌సర్ చేరుకున్నది. పాకిస్థాన్ ఎయిర్‌స్పేస్‌లో కనీసం రెండు కిలోమీటర్ల దూరం కూడా ఆ విమానం వెళ్లలేదని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ భూపేందర్ సింగ్ తెలిపారు.

## మేయర్‌కు ఊహించని అనుభవం.. మ్యాన్‌హోల్‌లో పడ్డ కార్మికుడు



ముంబై మేయర్ రీతూ తావ్డేకు ఊహించని అనుభవం ఎదురైంది. ముంబైవ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించడానికి ఆమె నగర వీధులలో పర్యటించారు. అయితే అనూహ్యంగా ఆమె కళ్లెదుటే ఓ వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడిపోయారు. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది ఆయనను రక్షించారు. ఇది చూసిన మేయర్ తీవ్ర అసహనంతో ఆగ్రహం చెందారు. నిన్న(మంగళవారం) ముంబైలో విపరీతంగా వర్షం కురిసింది. రాత్రంతా కురిసిన కుండపోత వర్షాల వల్ల నగరంలో రోడ్లు జలమయమవడమే కాకుండా, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల గోడలు కూలిపోవడం వంటి నష్టాలు కూడా జరిగాయి. దీంతో పరిస్థితులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి మేయర్ నగరంలో పర్యటించారు. బుధవారం ఉదయాన్నే దాదర్, హింద్‌మాతా, గాంధీ మార్కెట్ వంటి ప్రభావిత ప్రాంతాలకి వెళ్లారు. ఈ తనిఖీల సమయంలో ఒక పారిశుధ్య కార్మికుడు అక్కడే డ్రైనేజ్ తెరిచి ఉండడంతో అందులో పడిపోయాడు. అయితే ఈ సమయంలో అక్కడే ఉన్న మేయర్ ఈ ఘటనపై స్పందించారు. సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని, సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అయితే ఈ ఘటన అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడారు. భారీవర్షాల కారణంగా పేరుకపోయిన వ్యర్థాలను తొలగించడం కోసమే ఆ మ్యాన్‌హోల్ పారిశుద్ధ్య కార్మికులు పక్కకు జరిపారని వివరించారు. ఆ సమయంలో అక్కడ అక్కడ ఏర్పాటు చేసిన ‘అలర్ట్’ (హెచ్చరిక) బోర్డులను, బారికేడ్లను ప్రజల గమనించాలని సూచించారు. అయితే ముంబై వర్షాలపై ప్రతిపక్ష శివసేన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన ఆదిత్య థాకరే, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం బీఎంసీ నిధులను పూర్తిగా ఖాళీ చేసిందని ఆరోపించారు. గతంలో థాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం సూచించినట్లుగా రెయిన్ వాటర్ ట్యాంకులను నిర్మించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందన్నారు. అయితే ఈ వ్యాఖ్యలకు మేయర్ కౌంటరిచ్చారు. “ఇంట్లో కూర్చుంటే పనులు కావు, క్షేత్రస్థాయిలోకి రావాలి” అంటూ ఎద్దేవా చేశారు. కోవిడ్ సమయంలో ఆధిత్య థాకరే ఇంట్లోనే కూర్చుని పాలన సాగించారని ఆరోపించిన మేయర్, ప్రతిపక్షాలు ముందుగా రోడ్లపైకి వచ్చి చూడాలని హితవు పలికారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
25 జూన్ 2026

# రౌడీషీట్ లేకుంటే నేనూ లీడరే

-మొదటిపేజీ తరువాయి

మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో బల్దియా ఎన్నికలనే ప్రచారంతో సీటు తెచ్చుకొని కార్పొరేటర్‌గా గెలవాలని ఎంతో మంది ఆశగా చూస్తున్నారు. పాత కేసులు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీటర్‌గా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కొందరు ఆ పేరును తొలగించుకునేందుకు నానాతంటాలు పడాల్సి వస్తోంది. పోలీసు అధికారులు, రాజకీయ నేతలను సంప్రదించి తమపై ఉన్న షీట్ ఎలాగైనా తొలగించేలా చూడాలని బేరసారాలు ఆడుతున్నట్లు పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. మరికొందరు రౌడీషీట్ తొలగించుకునేందుకు ఏకంగా కోర్టులనే ఆశ్రయిస్తున్నారు.

ఇదిగో ఇలా : రాజేంద్రనగర్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఓ వ్యక్తికి గుర్తింపు ఉంది. కుల, మత బేధాల్లేకుండా తనవద్దకు వచ్చిన వారికి ఫండ్స్ ఇస్తుంటాడు. ఎప్పటినుంచో ప్రజాప్రతినిధిగా గెలవాలని అతనికి ఎప్పటినుంచో కోరిక. కానీ ఆయనపై పోలీసు కేసులున్నాయి. గతంలో జరిగిన పలు గొడవల్లో నేరుగా ప్రమేయం ఉండటంతో పండగలు, ఉత్సవాల సమయంలో పోలీసులు అతడిని బైండోవర్ చేస్తుంటారు. తనపై ఉన్న హిస్టరీ షీట్ తొలగించాలని ఇటీవల ఓ రాజకీయ నాయకుడిని ప్రాధేయపడుతున్నాడు.

పాతబస్తీ పరిధిలో ఒక నాయకుడు నెల రోజుల నుంచి 20 మందిని వెంటేసుకుని తిరుగుతూ పోషిస్తున్నాడు. వారికి భోజనం, వాహనాలకు పెట్రోల్, డీజిల్ వంటివన్నీ సమకూరుస్తూ ఖర్చులు భరిస్తున్నాడు. అక్రమంగా డబ్బు వసూలు చేసి, సేవా కార్యక్రమాల ముసుగులో మోసాలకు పాల్పడిన ఘరానా మాయగాడు రెండు పార్టీలు తనకే కార్పొరేటర్‌గా పోటీ చేసే అవకాశం కల్పిస్తాయని లోకల్‌గా ప్రచారం చేసుకుంటున్నాడు.

సికింద్రాబాద్ పరిధిలో ఒక వ్యాపారి తనపై ఉన్న పాత కేసు నుంచి బయట పడేయాలంటూ ఓ పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయించాడు.

గోల్కొండ జోన్‌పరిధిలో ఓ చోటా నేత ఓటర్లను ఆకట్టుకునేందుకు 30 నుంచి 40 మందిని వెంటేసుకొని




తిరుగుతున్నాడు. వీరి కోసం ఇంటి వద్ద ప్రత్యేకంగా కిచెన్ సైతం ఏర్పాటు చేశాడు. భోజనాలు వంటివన్నీ పెడుతున్నాడు.

అప్పుడే బలాబలాల ప్రదర్శన : ఈ ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగొచ్చనే ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. దీంతో భాగ్యనగరంలోని పలువురు ఆశావహులు అప్రమత్తమయ్యారు. ముందుగానే తమ బలాబలాలు చాటుకునేందుకు స్థానికంగా యూత్?ను దగ్గరకు చేరదీస్తున్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు కార్యక్రమాలకు పిలుపు లేకున్నా, అతిథులుగా వెళ్తున్నారని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కొత్తగా సోషల్? మీడియాలో ఖాతాలు తెరచి స్థానిక సమస్యలను విపరీతంగా పోస్ట్ చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల దృష్టిలో పడితే టికెట్ వస్తుందని, స్థానికులను ప్రసన్నం చేసుకుంటే కార్పొరేటర్?గా సునాయసకంగా గెలుస్తామనే ధీమాతో కొందరు చేస్తున్న ఆర్భాటం చర్చనీయాంశంగా మారింది. జీహెచ్?ఎంసీ ఎన్నికలను అక్టోబరు, నవంబరు నెలలో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. అందుకోసమే ఇటీవల నగరానికి నలువైపులా మెరుపు వేగంతో శంకుస్థాపనలు అభివృద్ధి పనులు చేశారనే చర్చ నడుస్తోంది.

**అక్టోబర్‌లో ముగియనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ**

సర్ పేరుతో జరగనున్న ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుంది. దీంతో ఆ ఓటరు జాబితా ఆధారంగా అదే నెలలో కొత్తగా ఏర్పడిన డివిజన్లకు పోలింగ్ సెంటర్లను నిర్ణయిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే రిపోర్టుల ఆధారంగా డివిజన్ల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఆ రెండు ప్రక్రియలు పూర్తవగానే నవంబరులో ఎన్నికల ప్రకటన జారీ అవుతుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

# సామాన్య ప్రజలపై పిడుగు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా జేఎస్‌ఆర్, ఆర్‌ఎన్‌ఆర్, హెచ్‌ఎంటీ, బీపీటీ వంటి సన్నాల రకాలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

పలు రాష్ట్రాల్లో వరి ఉత్పత్తి తగ్గడం, తెలంగాణలో ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేయడం వంటి కారణాలతో మార్కెట్లోకి వచ్చే ధాన్యం తగ్గిపోయింది. ఇవే ధరలు పెరగడానికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కొందరు మిల్లర్లు సన్నబియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బియ్యం ధరలకు రెక్కలొచ్చి క్వింటాకు ఏకంగా రూ.800 నుంచి రూ.1000 వరకు ఎగబాకాయి. గతంలో కిలో రూ.46 నుంచి రూ.55 ఉంటే ఇప్పుడు బాయిల్డ్?, రారైస్, తక్కువ రకం, ప్రీమియం క్వాలిటీని బట్టి రూ.55 నుంచి రూ.63కు పెరిగాయి.

**వివిధ రాష్ట్రాల్లో తగ్గిన సాగు**

మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక లాంటి పలు రాష్ట్రాల్లో గతంలో కంటే సన్నాల సాగు తగ్గినట్లు మిల్లర్లు, బియ్యం వ్యాపారులు చెబుతున్నారు. భారీ డిమాండ్ ఉండే జేఎస్‌ఆర్ రకం మహారాష్ట్రలో అత్యధికంగా పండిస్తున్నారు. ఈసారి అక్కడ దిగుబడి తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమని రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి వెల్లడించారు. తుంగభద్ర జలాశయానికి మరమ్మతుల కారణంగా కర్ణాటక ప్రభుత్వం యాసంగిలో క్రాప్? హాలిడే ప్రకటించింది. ఫలితంగా రాయచూరు, బళ్లారి, కొప్పళ తదితర జిల్లాల్లో వరిసాగు నీటి వసతి లేని కారణంగా నిలిచిపోయింది. అక్కడి వ్యాపారులు నారాయణపేట, గద్వాల, నిజామాబాద్, బాన్సువాడ, బోధన్ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో సన్నధాన్యం కొనుగోలు చేశారు. బెంగళూరు సహా కర్ణాటకలోని వివిధ మార్కెట్లకు తరలించడంతో రాష్ట్రంలో సన్నబియ్యం కొరత ఏర్పడుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

**ప్రభుత్వం వద్ద 10 లక్షల టన్నుల నిల్వలు**

గతంలో దొడ్డు బియ్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు, సన్నాలు ప్రైవేటు మార్కెట్లోకి వెళ్లేవి. ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఖరీఫ్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే భారీ స్థాయిలో వెళ్లింది. దీంతో ప్రభుత్వం వద్ద అవసరానికి మించి సుమారు 10 లక్షల టన్నుల నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఐదారు నెలలుగా ఈ ధాన్యం మార్కెట్లోకి రాకపోవడం కూడా ప్రస్తుత కొరతకు ఓ కారణంగా తెలుస్తోంది.

**ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తెలంగాణ సన్నబియ్యం**

తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యానికి బోనస్ ఇవ్వడం, రైతులు ఆ అవకాశాన్ని వినియోగించుకున్నారు. మిగతా రాష్ట్రాలు కూడా ఇదే తరహాలో బోనస్ ప్రకటిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. సన్నాల దిగుబడులు పెరిగి ధరలు కూడా దిగివస్తాయి. అదేవిధంగా తెలంగాణలో 5 లక్షల టన్నుల సన్న ధాన్యం వేలం పూర్తయ్యి ఈ నిల్వలు త్వరగా మార్కెట్లోకి వస్తే ధరలు వీలైనంత తగ్గే అవకాశం ఉందని దక్షిణాది రాష్ట్రాల బియ్యం ఎగుమతిదారుల అసోసియేషన్ ప్రతినిధి బీవీ కృష్ణారావు చెప్పారు. ఇదిలా ఉండగా సుమారు వెయ్యి మంది మిల్లర్లు రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలు, విదేశాలకు విక్రయిస్తున్నారని తెలిసింది.

# కాక్రోచ్ పార్టీకి కోట్ల నిధులెలా వస్తున్నాయి

**హైదరాబాద్ :** పగలేమో నిరసనలు చేస్తున్నారు. రాత్రి ఏమో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ప్రతి ప్రాంతంలోనూ నిరసన చేపట్టే ముందు హంగామా చేస్తున్నారు. ఇండిపెండెంట్ ఉద్యమాలు అని చెబుతూనే.. లగ్జరీ లెవెల్ లో నిరసనలు చేపడుతున్నారు. వాస్తవానికి ఇదంతా ఎలా జరుగుతోంది.. ఈ ఖర్చు మొత్తం ఎవరి భరిస్తున్నారు.. అభిజిత్ ఒక పిలుపు ఇవ్వగానే ఒక వర్గానికి సంబంధించిన మేధావులు ఎందుకు వస్తున్నారు.. వారంతా ఏం చేస్తున్నారు.. దీనిని ఎవరు నడిపిస్తున్నారు.. ఇప్పుడు ఇవే ప్రశ్నలు కొంతమంది పాత్రికేయులకు కలిగాయి. వారు ఇన్వెస్టిగేషన్ జర్నలిజం చేస్తే దారుణమైన నిజాలు వెలుగు చూశాయి. అప్పట్లో రైతు చట్టాలను కేంద్రం తీసుకొచ్చినప్పుడు టూల్ కిట్ ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమానికి మనదేశంలో చాలామంది సపోర్ట్ చేశారు. అందులో కమ్యూనిస్టు పార్టీలకు చెందినవారు ఎక్కువగా ఉన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ఆకస్మాత్తుగా ఖలిస్తాన్ నినాదం పుట్టింది. ఆ తర్వాత ఢిల్లీలో ఎర్రకోట మీద జాతీయ జెండాకు బదులుగా వేర్పాటు వాదులు తమ జెండాను ఎగరవేశారు. దీంతో వారి ఎజెండా క్లియర్గా కనిపించింది. ఇప్పుడు కాక్రోచ్ జనతా పార్టీ విషయంలో కూడా కొంతమంది పాత్రికేయులు లోతుగా దర్యాప్తు చేస్తే అసలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇదంతా కూడా కార్పొరేట్ టూల్ కిట్ మాదిరిగానే ఉంది.. ముఖ్యంగా కాక్రోచ్ జనతా పార్టీ వెబ్సైట్.. ఇతర సోషల్ మీడియా ఖాతాలు పనిచేయడం లేదు. ఆయనప్పటికీ వాటి సంబంధించిన డిజిటల్ వ్యవహారాలలో ఫుట్ ప్రింట్లు ఎప్పటికప్పుడు క్లియర్ చేసి కనిపిస్తున్నాయి.. పైగా నిరసనలు చేపడుతున్నప్పుడు దేశవ్యాప్తంగా నీట్ పరీక్షకు దరఖాస్తు చేసిన వారందరికీ సందేశాలు వెళుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ చేపడుతున్న నిరసనలో పాల్గొనాలని పిలుపులు వెళ్తున్నాయి. లక్షల మంది




విద్యార్థులకు అలా సందేశాలు వెళ్లడం వెనక ఎగ్జామ్ జీట్ ఆప్స్ వాడుతున్నట్టు తెలుస్తోంది. డేటా హార్వెస్టింగ్ కూడా చేపడుతున్నట్టు సమాచారం. ఇదంతా అంతా సులువైన వ్యవహారం కాదు. దీని వెనక పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలు.. పేరుపొందిన హ్యాకర్లు పనిచేస్తూ ఉంటారు. బొద్దింకల ఉద్యమానికి వీరంతా ఎందుకు సపోర్ట్ చేస్తున్నట్టు.. ఎన్ని కోట్ల ఖర్చు ఎందుకు పెడుతున్నట్టు.. అదే ఆందోళన కలిగిస్తోంది. పైగా కాక్రోచ్ జనతా పార్టీకి అనుబంధంగా ఉన్న కొన్ని వెబ్సైట్లో సోలానా బిట్ కాయిన్ గేట్ వే లు కనిపిస్తున్నాయి. ఇవి మనీలాండరింగ్ వ్యవహారాలలో కీలకంగా ఉంటాయి. ఎందుకంటే వీటి ద్వారా సులభంగా నల్లధనాన్ని తెల్లగా మార్చవచ్చు. మనదేశంలో ప్రభుత్వ బ్యాంకుల సర్వర్లు ఒప్పుకోనప్పటికీ.. ఎప్పటికప్పుడు హ్యాకర్లు డొమైన్ లు మార్చుతున్నారు. ఇలా వందల కోట్ల డబ్బు ఖర్చు పెట్టడం.. తెర వెనుక కార్పొరేట్ వ్యక్తులు ఉండడం.. ఈ ఉద్యమంలో కొంతమందిని భాగస్వాములు చేయడం చూస్తుంటే దేశాన్ని అస్థిరపరిచే కుట్ర పన్నినట్టు తెలుస్తోంది..నీట్ పరీక్ష నిర్వహణ దారుణంగా ఉన్న విషయం తెలిసిందే. ఇందులో చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న విషయం కూడా తెలిసిందే. ఈ వ్యవహారంలో దోషులను వదిలిపెట్టకూడదు. వారిపై చర్యలు తీసుకోవాల్సిందే. కానీ, నీట్ లో లోపాలను సాకుగా చూపించి కొంతమంది కృత్రిమ ఉద్యమాలు సృష్టించి.. దేశంలో అస్థిరత సృష్టించే పనులు చేపడితే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదు. ఎందుకంటే ఈ దేశం అందరిది. ఈ దేశంలో ఏవైనా దారుణాలు జరిగితే బాధపడేది కూడా అందరే.

## ఇంత అలసత్వమా?

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన టీపీసీసీ జూమ్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో ఎస్‌ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ సాధారణ అంశం కాదని, పేద ప్రజల హక్కులతో ముడిపడి ఉన్న కీలక ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ క్రమంలో కొందరి తీరుపై అసహనం వ్యక్తం చేసిన ఆయన.. పని చేయని వారి పేర్లు చెప్పే పరిస్థితి తెచ్చుకోవద్దని, అవసరమైతే వారి స్థానంలో కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తామని హెచ్చరించే దాకా వెళ్లారు. కొంతమంది నాయకులు ఎస్‌ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీసీసీ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాల వారీగా అవగాహన కార్యక్రమాలపై తన వద్ద పూర్తి నివేదిక ఉందని, ఎవరు పని చేస్తున్నారు.. ఎవరు చేయడం లేదన్న విషయం తనకు తెలుసని చెప్పారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఎస్‌ఐఆర్‌పై కాంగ్రెస్ తరఫున మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో సర్పంచ్‌లను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో పొరపాట్లు జరిగితే పేదల ఓటు హక్కు దెబ్బతినే ప్రమాదం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటు తొలగిపోతే భవిష్యత్తులో ఆధార్, రేషన్ కార్డులు వంటి సంక్షేమ ప్రయోజనాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి అన్యాయం జరగకుండా పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన సీఎం రేవంత్.. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని హెచ్చరించారు. మరో పది రోజుల సమయం ఇస్తున్నామని, ఈ వ్యవధిలో పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని అన్నారు. లేకపోతే చర్యలు తప్పవని సంకేతాలు ఇచ్చారు.

## రైతుల చెంతకే విత్తనాలు

-మొదటిపేజీ తరువాయి

అందుకు అనుగుణంగా అగ్రికల్చర్ ఉన్నతాధికారులు విత్తన కంపెనీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి నిల్వల సమాచారాన్ని సేకరించారు. ఆయా విత్తనాల పంపిణీకి సంబంధించి ఆదేశాలను జారీచేశారు. తొలి విడతగా తెలంగాణ వ్యాప్తంగా అన్ని రైతు వేదికల వద్ద సీడ్స్‌ను అందుబాటులో ఉంచినట్లుగా అధికారులు పేర్కొన్నారు. వారం రోజుల పాటు రైతులకు పంపిణీ చేస్తామని వివరించారు. ఆ తర్వాత దుకాణాలతో పాటు కోపరేటివ్ సొసైటీలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఆగ్రో సెంటర్లలో విక్రయిస్తామని అని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

**జిల్లా కలెక్టర్ల ఆమోదంతో**

జిల్లా కలెక్టర్ ఆమోదంతో వ్యవసాయ అధికారి రైతు వేదికలతో సహా విత్తన విక్రయ కేంద్రాలను ఎంపిక చేస్తారు. ఆయా సెంటర్లలో మాత్రమే విత్తనాలను ముందుగా నిల్వ చేస్తారు. రోజువారీ ప్రాతిపదికన ఆయా విత్తన విక్రయ కేంద్రాల వద్ద లభ్యమయ్యే సీడ్స్? వివరాలను ప్రజలకు తెలిసే విధంగా బోర్డుపై ప్రదర్శిస్తారు. మంగళవారం నుంచి జరుగుతున్న రైతు మేళాల్లో 1,24,649 క్వింటాళ్ల మేర వరి, 6,913 క్వింటాళ్ల పప్పు జాతి విత్తనాలు, 11,815 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టారు.

**విత్తనాల లభ్యత ఇలా**

సర్కారు నిర్దేశించిన 38.19 లక్షల ఎకరాల వరి సాగుకు 9.55 లక్షల క్వింటాళ్ల మేర విత్తనాలు అవసరమని ప్రాథమికంగా గుర్తించగా రాష్ట్రంలో ప్రస్తుతం 15.64 లక్షల క్వింటాళ్లు మేర అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రైవేటు కంపెనీల వద్ద 15.21 లక్షల క్వింటాళ్లు ఉండగా, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వద్ద 38,000 క్వింటాళ్లు, జాతీయ విత్తనాభివృద్ధి వద్ద 5 వేల క్వింటాళ్లు నిల్వ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇవిగాక వరి సాధారణ రకాలకు విత్తనాలు తగినంత ఉన్నాయని వ్యవసాయశాఖ సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఇతర పంట రకాల విత్తనాల అందుబాటు ఇలా :**

రాష్ట్రంలో 52 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగుకు 1.4 కోట్ల ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉండగా 3.60 కోట్ల సీడ్? ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

6.9 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న 29.6 లక్షల క్వింటాళ్లున్నాయి

ఐదు లక్షల ఎకరాల్లో కంది పంట సాగుకు 15 వేల క్వింటాళ్లకు గాను 26 వేల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

15 వేల ఎకరాల్లో పెసర పంట సాగుకు 2,880 క్వింటాళ్లు అవసరం కాగా 3,110 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నాయి.

50,000 ఎకరాల్లో వేరుసెనగ సాగుకు 19,285 క్వింటాళ్లకుగాను 25,052 క్వింటాళు న్నాయి

పైన వివరించినవి మాత్రమే కాకుండా సోయాబీన్, ఇతర నూనెగింజలు, తృణధాన్యాలు, కూరగాయల లాంటి పంటలకు విత్తనాలు మరో 52 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి.

## కొత్త సీఎస్‌గా సంజయ్!

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర తదుపరి ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌జాజు ఖరారయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఆయన ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్నారు. సంజయ్ జాజును తిరిగి తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం (జూన్ 23న) కీలక నిర్ణయం తీసుకొంది. ప్రస్తుత తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారని తెలిసిందే. ఈ



క్రమంలో కొత్త ప్రధాన కార్యదర్శి రేసులో జయేశ్ రంజన్‌తో పాటు సంజయ్‌జాజ పేర్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి.. చివరకు జాజు వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. సీఎం రేవంత్ కోరిక మేరకు ఆయనను తెలంగాణకు బదిలీ చేసినట్లుగా వినిపిస్తోంది. సంజయ్ జాజు 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విజయవాడ సబ్‌కలెక్టర్‌గా సేవలందించారు. అంతే కాకుండా హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా పలు కీలక బాధ్యతలను నిర్వహించడంతో సీఎం రేవంత్ రెడ్డి.. జాజు వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. సంజయ్ జాజు 2014 నుంచి కేంద్ర సర్వీసులో కొనసాగుతున్నారు. సీఎస్ రామకృష్ణారావు రిటర్మెంట్ దగ్గర పడుతుండటంతో ఆ స్థానంలో కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుని అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుందని సమాచారం. సీఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతలు చేపడితే 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. ఆగస్టు 2025లో పదవీ విరమణ చేసిన కె. రామకృష్ణారావుకు కేంద్ర ప్రభుత్వం మొదట 7 నెలల పొడిగింపును మంజూరు చేసింది. ఆ తర్వాత మరో 3 నెలల పాటు పొడిగించింది. దాంతో ఆయన పదవీ కాలం జూన్ 30తో ముగియనుంది. కుట్లిగి రామకృష్ణారావు 1991 క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాగా, ఆయనను 2025 ఏప్రిల్ 27న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఏప్రిల్ 30న బాధ్యతలు చేపట్టిన ఆయన సీఎస్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్థిక కార్యదర్శిగా, ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పలు హోదాల్లో పని చేసిన ఆయన పలు బడ్జెట్‌ల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు.

## సంపాదకీయం

# లక్షల లెక్కలు కాగితాలపై? కోట్ల లెక్కలు క్షేత్రస్థాయిలో!

మనం ఎప్పుడూ కొన్ని తప్పుడు ప్రశ్నలు అడుగుతూంటాం.ఒక ఎంపీ జీతం ఎంత ఒక ఎమ్మెల్యేకు ఎన్ని అలవెన్సులు వస్తాయి? ప్రజాప్రతినిధులకు ఎన్ని సౌకర్యాలు ఉన్నాయి? ఇలాంటివే సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో, టీ స్టాళ్ల దగ్గర ఈ చర్చ ఎక్కువగా జరుగుతుంది. కానీ ఈ క్రమంలో అవసరమైన ఓ ప్రశ్న మాత్రం ఎక్కడో మిస్సవుతోంది. అదేంటో తెలుసా?ఒక ఎంపీ కావడానికి ఎంత ఖర్చవుతుంది? ఒక ఎమ్మెల్యే సీటు గెలవడానికి ఎంత డబ్బు ఖర్చవుతుంది అని. ఎందుకంటే ..2024 ఎన్నికల్లో భారతదేశం ఖర్చు చేసిన మొత్తం అమెరికా ఎన్నికల ఖర్చును కూడా దాటిపోయింది. అదెంత..అలా ఎలా జరిగింది అంటారా?దేశం మొత్తం కలిపి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చైన మొత్తం డబ్బు దాదాపు ?1.35 లక్షల కోట్లు అని నివేదికలు చెబుతున్నాయి. ఈ సంఖ్య ఎంత పెద్దదంటే? భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు? ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రజాస్వామ్యంగా కూడా మారుతోందా అనే ప్రశ్నను లేవనెత్తే స్థాయిలో ఉంది.ఎన్నికల ఖర్చు గ్రాఫ్ 2014 ? ?30,000 కోట్లు2019 ? ?60,000 కోట్లు 2024 ? ?1,35,000 కోట్లుఅంటే? కేవలం 10 ఏళ్లలో ఎన్నికల ఖర్చు నాలుగు రెట్లు పెరిగిందిఎన్నికల సంఘం ప్రకారం ఒక లోక్‌సభ అభ్యర్థి గరిష్టంగా ?95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. ఎమ్మెల్యే అభ్యర్థులకు కూడా పరిమితి ఉంది. కాగితాలపై చూస్తే అంతా బాగానే కనిపిస్తుంది. కానీ రాజకీయాలను దగ్గరగా గమనించే వారికి ఒక విషయం స్పష్టంగా తెలుసు.ఎన్నికలు నామినేషన్‌తో మొదలవ్వవు. దానికి నెలల ముందు నుంచే మొదలవుతాయి. ప్రచారానికి టీమ్ లు , సోషల్ మీడియా టీమ్‌లు, సర్వేలు, వ్యూహకర్తలు, కార్యకర్తల నిర్వహణ, సమావేశాలు, ర్యాలీలు? ఇవన్నీ అధికారిక లెక్కల్లో కనిపించవు.అందుకే ఒక తీవ్రమైన పోటీ ఉన్న ఎంపీ స్థానం కోసం ?30 కోట్ల నుంచి ?50 కోట్ల వరకు ఖర్చవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో కూడా ఖర్చు ?10 కోట్ల నుంచి ?25 కోట్ల వరకు వెళ్తోందని అంచనాలు ఉన్నాయి.ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే పోస్టర్లు, పాంప్లేట్లు, కొన్ని సభలు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ వార్ రూమ్స్. డేటా అనలిటిక్స్. మీడియా ప్రకటనలు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు. ప్రత్యేక పీఆర్ టీమ్ లు. హెలికాప్టర్లు. భారీ కాన్వాయ్‌లు. వేలాది మంది కార్యకర్తల నిర్వహణ. ఇవన్నీ చూస్తే? ఎలక్షన్స్ ఇప్పుడు కార్పొరేట్ మార్కెటింగ్ క్యాంపెయిన్ గా అనిపిస్తున్నాయి.ఖచ్చితంగా చెప్పాలంటే ?ఒక కంపెనీ తన ఉత్పత్తిని అమ్మడానికి ఎంత ప్లాన్ చేస్తుందో? రాజకీయ పార్టీలు కూడా ఓటును పొందడానికి అంతే ప్రణాళికతో పనిచేస్తున్నాయి. సంఖ్య వినడానికి పెద్దగా అనిపిస్తుంది. కానీ దాని పరిమాణం అర్థం కావాలంటే మరో కోణంలో చూడాలి. ఆ డబ్బుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించవచ్చు. వందలాది ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించవచ్చు. లక్షల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించవచ్చు. కానీ ఆ మొత్తం డబ్బు కేవలం కొన్ని వారాల ఎన్నికల ప్రచారంలో ఖర్చయిందంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇవి లేకుండా ఎన్నికలలో పోటీ చెయ్యలేమా అంటే..పోటీ ప్రపంచంలో తప్పదు అంటారు.ఎన్నికల సమయంలో నగదు, మద్యం, బంగారం, బహుమతులు పట్టుబడ్డాయనే వార్తలు మనం తరచూ చూస్తుంటాం. కానీ వాటి మొత్తం విలువ ఎప్పుడైనా గమనించారా?2019 ఎన్నికల్లో సీజ్ చేసిన నగదు, బంగారం, మద్యం, డ్రగ్స్ తదితర వస్తువుల విలువ ?3,477 కోట్లు.2024లో అది ?10,000 కోట్లకు పైగా చేరింది.అంటే ఐదేళ్లలో దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. పట్టుబడింది ఇంత ఉంటే? పట్టుబడనిది ఎంత ఉంటుంది? ఒక్క సారి ఆలోచించండి.మనం ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు వెళ్తాం. కొన్ని నిమిషాల్లో పని అయిపోతుంది. కానీ ఆ ఒక్క ఓటు కోసం రాజకీయ వ్యవస్థ ఎంత ఖర్చు పెడుతోందో లెక్కలు తెలిస్తే మతిపోతుంది. అంచనాల ప్రకారం 2024 ఎన్నికల్లో ఒక్కో ఓటరుపై సగటున దాదాపు ?1,400 ఖర్చయింది. అంటే నలుగురు ఓటర్లు ఉన్న ఒక కుటుంబం కోసం సగటున ?5,600.ఒక ఓటు కోసం ఇంత ఖర్చు పెట్టే వ్యవస్థ? ఆ ఓటు వెనుక ఉన్న పౌరుడి జీవితాన్ని మెరుగుపరచడానికి ఎంత ఖర్చు పెడుతోంది? అని.ప్రజాస్వామ్యం అందరికీ అవకాశం ఇవ్వాలి. కానీ ఎన్నికలు రోజు రోజుకీ మరింత ఖరీదైనవిగా మారుతున్న కొద్దీ ఒక ప్రమాదం పెరుగుతోంది. సామర్థ్యం ఉన్నవాళ్లు కాదు? సంపద ఉన్నవాళ్లు ముందుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది.ఎన్నికలు అంటే అభ్యర్థుల మధ్య పోటీగా కాకుండా? ఆర్థిక శక్తుల పోటీగా మారే ప్రమాదం వచ్చేసింది. ఈ క్రమంలో రాజకీయాల్లోకి రావాలనుకునే ఒక సాధారణ ఉపాధ్యాయుడు, ఒక రైతు, ఒక సామాజిక కార్యకర్తకు నిజంగా అవకాశం ఉంటుందా?అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే నాయకుల జీతాలను మాత్రమే కాదు? ఎన్నికల్లో ప్రవహిస్తున్న డబ్బును కూడా ప్రశ్నించారు.

# బీజేపీని జయించగల భావజాలమేదీ?



'కాంగ్రెస్ పరాన్నజీవి, ఇతర పార్టీలపై ఆధారపడి అది మనుగడ సాగిస్తోంది. అవసరం తీరిపోగానే వాటిని వదుల్చుకుంటుంది' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్ది రోజుల క్రితం వ్యాఖ్యానించారు. తమిళనాడులో డీఎంకేను వదిలిపెట్టి సినీనటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలపడాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారు. అయితే గత కొద్ది రోజులుగా సంభవిస్తోన్న పరిణామాలను చూసిన తర్వాత 2029 ఎన్నికల నాటికి ఇండియా కూటమిలో ఎన్ని పార్టీలు ఉంటాయో, మోదీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్‌లో ఎన్ని పార్టీలు ఉంటాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పలు ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షలో పడ్డాయి. అవి తమ దారి ఏదో తేల్చుకోవల్సివుంది. అయితే అందుకు వాటికి ఎక్కువ సమయం లేదు. ఈ నేపథ్యంలో.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ముఖాముఖి పోటీ ఉంటుందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రాంతీయ పార్టీలు చీలిపోవడం, బీజేపీతో అవి చేతులు కలపడం గురించి కాంగ్రెస్ పెద్దగా కలవరపడుతున్నట్లు కనిపించడం లేదు. నిజానికి చాలా ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ రాజకీయ స్థలాన్ని ఆక్రమించినవే. పార్లమెంటు ఉభయ సభల్లో తన సంఖ్యా బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ యుద్ధ ప్రాతిపదికన అమలు పరుస్తున్న వ్యూహాలను కూడా కాంగ్రెస్ అంత తీవ్రంగా పరిగణించడం లేదు. 2029 నాటికి బీజేపీతో ముఖాముఖి తలపడాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ అడుగులు వేస్తున్నట్లు కనపడుతోంది. ముఖ్యంగా దేశంలో యువతను తమవైపు ఎలా సమీకరించాలా అన్న ఆలోచనే కాంగ్రెస్‌లో కనపడుతోంది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ నిశ్చితంగా ఒక అజెండా ప్రకారం పనిచేస్తున్నట్లు కనపడదు. కులగణన, సామాజిక న్యాయం, రిజర్వేషన్లపై నిన్నటి వరకూ దృష్టి సారించిన కాంగ్రెస్ ఇప్పుడు యువతలో పెరుగుతున్న ఆందోళనను గమనించి వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాజస్థాన్‌లోని కోటలో 'ఛాత్రోంకీ గూంజ్' పేరిట భారీ ర్యాలీని ఏర్పాటు చేసింది. ఆ ర్యాలీలో వేలాది యువతీ యువకులను ఉద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగించారు. కాక్రోచ్ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రాబల్యం కూడా యువతను ఆకట్టుకునేందుకై రాహుల్‌గాంధీ దృఢసంకల్పంతో పూనుకోవడానికి కారణం కావచ్చు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువత, ముఖ్యంగా తొలిసారి నమోదు చేసుకున్న ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారని అనేక అధ్యయనాలు తెలిపాయి. 2029 నాటికి ఈ పరిస్థితి మారుతుందా? యువతలో, మహిళల్లో కాంగ్రెస్ కోల్పోయిన పట్టు తిరిగి సాధించగలుగుతుందా? ఇది ఆ పార్టీ భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమైనది.

అయితే లోక్‌సభలో, రాజ్యసభలో సీట్లు పెంచుకోవడానికి, అనేక పార్టీలను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి బీజేపీ చేస్తోన్న తీవ్ర ప్రయత్నాలను తేలికగా కొట్టి పారేయడానికి వీలులేదు. ఆరెస్సెస్ నేత ఒకరు చెప్పినదాని ప్రకారం, బీజేపీకి హిందూత్వ అజెండా అత్యంత ప్రధానమైనది. 2029లో మళ్లీ గెలవడమే కాకుండా మరికొన్ని దశాబ్దాలపాటు అధికారంలో ఉన్నప్పుడే ఆ అజెండాను నెరవేర్చుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ అజెండాలో భాగంగానే దేశవ్యాప్తంగా అనేక ప్రాంతీయ పార్టీలపై బీజేపీ దృష్టి సారించింది. జనతాదళ్(యు), తృణమూల్ కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీలను పూర్తిగా కైవసం చేసుకునేందుకు వేగంగా పావులు కదుపుతోంది. తమిళనాడులో డీఎంకే, జార్ఖండ్‌లో జేఎంఎం, తెలంగాణలో బీఆర్ఎస్, ఢిల్లీలో ఆప్ ఇప్పుడు తమ దారి ఎటువైపో నిర్ణయించుకోవాల్సిన విషమ పరీక్షలో ఉన్నాయి. తమ అజెండా పూర్తి కావాలంటే అనేక పార్టీలను నయానో, భయానో తమవైపు తిప్పుకోవడమే బీజేపీ అనుసరిస్తున్న వ్యూహం.

2029లో 2024 ఎన్నికల ఫలితాలు పునరావృతమై, తాము మెజారిటీ కోల్పోయే ప్రమాదం మళ్లీ వాటిల్లకుండా ఉండేందుకు బీజేపీ వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటిలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అత్యంత కీలకమైనవి. మోదీ సర్కార్ నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన జరిగే తీరు పూర్తిగా బీజేపీకి అనుకూలంగా ఉంటుందని మరి చెప్పనవసరం లేదు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కాంగ్రెస్, ఎన్డీఏలో లేని ప్రాంతీయ పార్టీలు అధిక ప్రయోజనం పొందకుండా ఉండేందుకు బీజేపీ సంకల్పించింది. గత ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాని ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అత్యధిక సీట్లు సాధించేందుకు; బిహార్, జార్ఖండ్, హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో భౌగోళిక, జనాభా నిర్మాణాల్లో మార్పుల ద్వారా అదనపు స్థానాలు సాధించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.

అసోం, జమ్మూకశ్మీర్‌లో డీలిమిటేషన్ తర్వాత ఏమి జరిగిందో తెలిసిందే. అసోంలో దిగువ అసోం, బరాక్ వ్యాలీలో ముస్లిం మెజారిటీ నియోజకవర్గాలను చీల్చారు. స్థానికులు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో చీల్చిన ప్రాంతాలను చేర్చారు. దీనివల్ల కాంగ్రెస్‌కు, ఏఐయూడీఎఫ్‌కూ తీవ్ర నష్టం జరిగింది. ఎస్టీ, ఎస్సీలకు సీట్లు పెరగడం వల్ల బీజేపీ ప్రాంతీయ మిత్రపక్షాలు లబ్ధి పొందాయి. జమ్మూకశ్మీర్‌లో కూడా కశ్మీర్ లోయలోని ముస్లిం మెజారిటీ సీట్ల కంటే జమ్మూలోని హిందూ మెజారిటీ సీట్లు పెరిగాయి. అంతేకాదు, చాలా మంది సిట్టింగ్ ఎంపీల పట్ల ప్రజలకు ఉండే వ్యతిరేకతను అరికట్టేందుకు సీట్ల పెంపు ఎంతో ఉపయోగపడుతుంది. పెరిగిన సీట్లలో యువత, మహిళలకు, అనేకమంది కొత్త వారికి అవకాశాలు కల్పించి సాధ్యమైనన్ని మెజారిటీ సీట్లను సాధించుకోవడమే బీజేపీ లక్ష్యం.

రకరకాల సమస్యలను చేపట్టి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా తన ఉనికిని పటిష్ఠం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్‌కు బీజేపీ సమగ్ర వ్యూహాలపై ఎంతవరకు అవగాహన ఉన్నదో చెప్పడం కష్టం. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా మోదీ కేంద్రీకృతంగా ఉంటోంది. దేశవ్యాప్తంగా పెరుగుతోన్న ఆరెస్సెస్ ప్రభావాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడానికి బదులు ఆ సంస్థకు రిజిస్ట్రేషన్ ఉన్నదా, లేదా అన్న నిరుపయోగ చర్చల్ని లేవనెత్తుతున్నది. ఈ కారణంగానే బీజేపీ వ్యూహాల గుట్టుమట్టులు కాంగ్రెస్‌కు అర్థమవుతున్నాయా లేదా అన్న అనుమానం కలుగుతోంది. దేశంలోని మొత్తం 4,123 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్‌కు 662 సీట్లు మాత్రమే ఉన్నాయి. అయిదు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ సీటు కూడా రాలేదు. యూపీ, బిహార్, గుజరాత్, ఒడిషా వంటి రాష్ట్రాల్లో పది శాతం సీట్లు కూడా ఆ పార్టీ గెలుచుకోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కూ మధ్య 286 నియోజకవర్గాల్లో ముఖాముఖి పోరు జరిగితే, బీజేపీ 180 సీట్లు, కాంగ్రెస్ 83 సీట్లు గెలుచుకుంది. లోక్‌సభలో డిప్యూటీ నాయకుడు, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న గౌరవ్ గొగోయ్ ఇటీవల అసోం అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారు. మరో లోక్‌సభ సభ్యుడు, రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు వైద్యలింగం సైతం గత అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. ప్రభుత్వ వ్యతిరేకతను కాంగ్రెస్ తనకు అనుకూలంగా ఎందుకు ఉపయోగించుకోలేకపోతోంది? ఈ ప్రశ్నకు జవాబు సాధించనంతవరకూ ఎన్ని ర్యాలీలు నిర్వహించినా, ఎన్ని నాటకీయ ప్రదర్శనలు చేసినా, కాంగ్రెస్ బలోపేతం అయ్యే అవకాశాలు లేవు. కాంగ్రెస్ ఎదుర్కొంటున్న సమస్యనే ప్రాంతీయ పార్టీలూ ఎదుర్కొంటున్నాయి. పైగా అవి చీలిపోతున్నాయి. ఇందుకు బీజేపీని నిందించడం కన్నా ఈ చీలికలు ఎందుకు సంభవిస్తున్నాయో, ప్రజలు తమను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రాంతీయ పార్టీల అధినాయకులు నిష్పాక్షికంగా ఆత్మశోధన చేసుకుంటున్నారా? ఒకప్పుడు బలమైన సైద్ధాంతిక శక్తులుగా ఉన్న వామపక్షాల ప్రస్తుత గమ్యం ఏమిటి?

వాస్తవం ఏమిటంటే, ఒకే నాయకుడి ఆకర్షణ, కుల సమీకరణాలపై ఆధారపడ్డ ప్రాంతీయ కోటలు వేగంగా కుప్పకూలిపోతున్నాయి. సిద్ధాంతాలేవీ లేకుండా కేవలం అధికార ఆకాంక్షలు ఎల్లకాలమూ నెరవేరవని స్పష్టమవుతోంది. మమతా బెనర్జీ, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, అరవింద్ కేజ్రీవాల్, కేసీఆర్, నవీన్ పట్నాయక్, జగన్‌ల భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడానికి కారణం అదే. ప్రాంతీయ దిగ్గజాలు ఎవరూ ఇప్పుడు ప్రాబల్యంలో లేరు. కొన్ని పార్టీల వారసుల పోకడలు ఆశాజనకంగా లేవు. జరుగుతున్నవి సాధారణ పరిణామాలు కాదు, భారత రాజకీయ వ్యవస్థలో జరుగుతున్న లోతైన నిర్మాణాత్మక మార్పులకు అవి సంకేతాలని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు.

బీజేపీ మోదీ చుట్టూ తిరుగుతున్నప్పటికీ అది మోదీ ఆధారిత పార్టీ కాదు. దాని ఎత్తుగడలు, వ్యూహాలు, విస్తరణ, చర్యలు ఒక దీర్ఘకాలిక లక్ష్యానికి అనుగుణంగా సాగేందుకు బీజేపీ వెనుక ఉన్న ప్రబల శక్తులు ఎన్నో. ఈ లక్ష్య సాధనలో మోదీ ఒక ప్రధాన ఉపకరణం మాత్రమే అని ఆరెస్సెస్‌కూ, బీజేపీకీ తెలుసు. కాంగ్రెస్ విషయంలో అలా చెప్పడానికి వీలు లేదు. వారసత్వ నాయకత్వం ఆధారితంగా సాగుతున్న కాంగ్రెస్ సంస్థాగతంగా, సైద్ధాంతికంగా పటిష్ఠమై, గ్రామగ్రామాల్లో విస్తరించి, తిరుగులేని జనప్రియ పార్టీగా మారేందుకు రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రయత్నాలు ఏవీ కనపడడం లేదు. ప్రత్యర్థి బలహీనత, తప్పుడు చర్యలు, ప్రభుత్వ వ్యతిరేకత మూలంగా యాదృచ్ఛికంగా అధికారం లభించే అవకాశాలు లేవని ఇప్పటికి ఎన్నోసార్లు రుజువైంది. భారత రాజకీయ వ్యవస్థ కుప్పకూలిపోతుందని కొందరు ఆందోళనపడడంలో అర్థం లేదు. నిజానికి అది పునర్వ్యవస్థీకరణ దశలో ఉన్నది. ప్రాంతీయ స్వరాలు సన్నగిల్లడం మూలాన వచ్చే ఎన్నికల్లో రెండు జాతీయ ధ్రువాల మధ్య ప్రధాన పోటీ ఏర్పడే అవకాశం స్పష్టంగా కనపడుతోంది. ఆత్మరక్షణలో ఉన్న ప్రాంతీయ శక్తులు ఏదో ఒక ధ్రువం వైపు మొగ్గు చూపడం అనివార్య పరిణామంగా కనపడుతోంది. డీలిమిటేషన్, ప్రాంతీయ శక్తులు చేరడం మూలంగా కాంగ్రెస్‌కు సహజంగా కొన్ని సీట్లు పెరగవచ్చు. కానీ ప్రభంజనం రేకెత్తించి అధికారం సాధించాలంటే, వ్యక్తుల కన్నా జాతీయ స్థాయి ప్రభావశీల భావజాలాలు రాజకీయాలను నిర్ణయించడం ప్రధానం.

# మళ్లీ మరో విషాదం!

దేశంలో మూడు వారాలలోపే మరో ఘోరం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం మధ్యాహ్నం ఒక యానిమేషన్ కోచింగ్ సెంటర్ మంటల్లో చిక్కుకోవటంతో నలుగురు బాలికలతోపాటు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వీరిలో అత్యధికులు 25 యేళ్ల లోపువారే. మృతుల్లో దాదాపు అందరూ కాలిన గాయాలతోకాక, దట్టమైన పొగలో చిక్కుకుని ఊపిరాడక మరణించిన వారే కావటం గమనించదగ్గది. నివాసగృహ సముదాయాలైనా, వాణిజ్యభవనాలైనా నిర్దిష్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సివుంటుంది.

భవన నిర్మాణ సమయంలోనే నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) కోసం దరఖాస్తు చేసుకోవటం, అధికారుల తనిఖీలు నిబంధనల ప్రకారం జరిగితీరాలి. ఒకసారి కాదు... భవనం పూర్తయ్యేలోగా రెండు మూడు సార్లు ఈ తనిఖీలుండాలి. అగ్నిమాపక వ్యవస్థలు సక్రమంగా ఉన్నాయా లేదా... అను కోని విపత్తు ముంచుకొచ్చినప్పుడు తప్పించుకోవటానికి అత్యవసర మార్గాలు ఏర్పాటు చేసుకున్నారా లేదా అనే అంశాలు వీటిల్లో తప్పనిసరి. ఎన్‌ఓసీకి చెల్లుబాటయ్యే కాలం పూర్తయినాక కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. మళ్లీ అన్ని తనిఖీలూ ఉంటాయి. ఇవన్నీ కాగితాల్లో పొందుపరిచినంతగా ఆచరణలో కనబడవు. సమస్య మూలం అక్కడేవుంది.

లక్నోకూ, ఢిల్లీకీ మధ్య ఏమంత దూరం లేదు. ఢిల్లీలో ఈ నెల మొదట్లో జరిగిన రెండు విషాద ఘటనల్లో 30 మంది వరకూ మరణించారు. అనేకులు గాయపడ్డారు. మొదటి ఉదంతంలో అయిదంతస్తుల భవనం కుప్పకూలింది. రెండో ఘటన ఒక హోటల్ మంటల్లో చిక్కుకోవటానికి సంబంధించింది. ఇవి



రెండూ మూడు రోజుల వ్యవధిలో జరిగాయి. కానీ ఉత్తరప్రదేశ్ అధికార యంత్రాంగం మన్నుతిన్న పాములా ఉండిపోయింది. 'విషాదం చోటుచేసుకున్నది ఎక్కడో కదా... మనకేమిటి సంబంధమ'ని భావించే ధోరణి అన్ని వ్యవస్థల్లో పాతుకుపోయిన పర్యవసానంగా ఎక్కడో ఒకచోట ఇలాంటివి తప్పడం లేదు. లక్నోలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఆవాసానికే అనుమతు లున్నచోట వాణిజ్య కార్యకలాపాలు సాగుతుంటే అధికారుల్లో ఏ ఒక్కరికీ పట్టలేదు.

లక్నో అభివృద్ధి ప్రాధికార సంస్థ అధికారులు దీన్ని కూల్చటానికి 2016లో నోటీసు లిచ్చినా రెండు నెలల తర్వాత వాటిని ఉపసంహరించుకున్నారు. కారణమేమిటో ఎవరికీ తెలియదు! ఇలా ఏదో ఒక విభాగానికి సర్వాధికారాలూ ఇవ్వటం సమస్యలకు కారణ మవుతున్నది. స్థానిక పోలీసు విభాగం, అగ్నిమాపక విభాగం, విద్యుత్ శాఖ ఇంజినీర్లు, భవన నిర్మాణ నిపుణులు వగైరాలతో కమిటీ ఏర్పరిచి, నిర్దిష్ట వ్యవధిలో అది తప్పని సరిగా సమావేశమయ్యేలా... అనుమతులకూ, నిరాకరణలకూ స్పష్టమైన కారణాలు నమోదు చేసేలా ఉంటే ఇలా లోపాయికారీ వ్యవహారాలు సాగవు. కానీ మన ప్రభు త్వాలు ఆ పని చేయవు. ఘటన జరగ్గానే రావటం, సానుభూతులూ, సంతాపాలూ, ఎక్స్‌గ్రేషియా ప్రకటనలు మాత్రం రివాజు. అగ్నిప్రమాదం గురించి తెలిశాక ఏకంగా 19 అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. కానీ చాలాసేపటివరకూ ప్రమాదంలో చిక్కుకున్న భవంతిలోకి వెళ్లటం శక్యం కాలేదు. ఆ భవంతికి ఇరుకైన మెట్ల దారి మినహా మరేం లేకపోవటంతో పక్క భవనాలనుంచి అప్పటికప్పుడు నిచ్చెనలు వేసి ఆ భవనంపైకి చేరుకుని పనిచేయాల్సివచ్చింది. బయటపడే మార్గం లేక వాష్‌రూంలో చేరి నలుగురు పిల్లలు కాపాడమంటూ ఫోన్లలో తమ తల్లిదండ్రులను వేడుకున్నారు. బయటకు వినపడేలా ఆర్తనాదాలు చేశారు. కానీ ఈలోగానే మృత్యుధూమం వారిని కాటేసింది. అవి నివాస భవనాలైనా, వాణిజ్య సముదాయాలైనా తొలినాళ్ల అంచనాకు మించి విద్యుత్ వినియోగం ఉంటుంది. అధిక శక్తిగల విద్యుత్ ఉపకరణాల వాడకం పెరగటం, వాటికి అనుగుణమైన వైరింగ్ లేకపోవటంవల్ల లోడ్ ఎక్కువై షార్ట్ సర్క్యూట్ జరిగిమంటలంటుకుంటాయి. నిర్మాణానికి వాడేవన్నీ మండే స్వభావంగలవి కావటంతో మంటలు పెనువేగంతో వ్యాపిస్తున్నాయి. ఈ రెండేళ్లలో ఒక్క ఢిల్లీలోనే ఆసుపత్రుల్లో 78 అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నివాసప్రాంతాల్లో వెయ్యికిపైగా ప్రమాదాలు సంభవించాయి. లక్నో విషాదమైనా ప్రభుత్వాల కళ్లు తెరిపించకపోతే అంతకన్నా దారుణం మరోటి ఉండదు.

# ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలి

## జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత




**నవగీతం, జూన్24,(జగిత్యాల ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, పకడ్బందీగా, పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత కోరారు. సర్ కార్యక్రమం అమలులో జగిత్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు.బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన చేపట్టి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి నింపిన ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్‌ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు.జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం చేపట్టి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.బీఎల్‌వోలు ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఫారం అందని వారు లేదా పొరపాటున జాబితాలో చేరని అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు, ప్రత్యేక అధికారులు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని తెలిపారు. బి ఎల్ వో లు బి ఎల్ ఏ లకు పూర్తిస్థాయిలో సర్ కార్యక్రమం పై శిక్షణ కల్పించారని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే సర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించ బడకుండా, అనర్హులు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్సీసీ వాలంటీర్ల సహకారాన్ని కూడా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పుల కోసం ఫారం-8, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 వినియోగించాలని సూచించారు. సర్ కార్యక్రమంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, మున్సిపల్ కమిషనర్ లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి







రెనోవేషన్ చేసిన మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**నవగీతం,జూన్24,(మెట్ పల్లి ప్రతినిధి):** ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన (రెనోవేషన్ చేసిన) మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను ఎస్పీ పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, కార్యాలయ పరిసరాల పరిశుభ్రత,ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సూచనలు చేశారు.పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు, సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ గారు సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు.సూత్రా ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు.కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ,తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ కి సూచించారు. సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు , హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు.కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని ,అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మెట్ పల్లి సర్కిల్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటడం జరిగింది.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాములు , సి.ఐ లు సురేష్ బాబు,లక్ష్మి నారాయణ. డీసీఆర్బీ ఎస్.ఐ ప్రదీప్,ఎస్సైలు కిరణ్ కుమార్,అనిల్ ,చిరంజీవి, నవీన్, గంగాధర్,రాజునాయక్, రవికిరణ్, శ్రీధర్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య ఇవ్వాలని కలెక్టర్ కు వినతి..

**బీసీ సంక్షేమ అనుబంధ సంఘ నాయకులు..**

**నవగీతం,జూన్24,కరీంనగర్:**



జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీని ప్రైవేట్ పాఠశాలలు ఇవ్వడం లేదు వెంటనే 100% రాయితీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బుధవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ని కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్ , బీసీ యువజన సంఘం నాయకులు మాదాసు , సంజీవ్ , బీసీ విద్యార్థి సంఘం నాయకులు కలిశారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల పిల్లలకు పూర్తి ఉచిత విద్యను అందించాలని ఆదేశాలు జారీ చేయగా దానికి అనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ఇయ్యగా ప్రైవేట్ పాఠశాలలు పూర్తిస్థాయిలో ఫీజు మాఫీ చేయడం సాధ్యం కాదని 10 నుండి 20% మాత్రమే మాఫీ చేస్తామని చెప్పడం జరిగింది సమాజానికి ఉపయోగపడే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య ఎంతైనా అవసరం ఉంది కావున పూర్తిస్థాయి ఫీజులు మాఫీ చేసే విధంగా తమరు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగింది.

### దుబాయ్‌లో మృతి చెందిన వలస కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం.

**నవగీతం, జూన్24,(రాయికల్ ప్రతినిధి).**



రాయికల్ మండలం వడ్డలింగాపూర్ గ్రామానికి చెందిన వద్లూరి రాజేందర్ ఇటీవల ఉపాధి కోసం దుబాయ్‌కు వలస వెళ్లగా, అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.ఈ నేపథ్యంలో జిడబ్ల్యూఎస్ దుబాయ్ డి ఎస్ పి అధ్యక్షులు, తెలుగు డ్రైవర్స్ హెల్పింగ్ గ్రూప్ అడ్మిన్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గల్ఫ్ కార్మికులు, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రేమ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు తిరుపతి, బాబు, జీవన్ కలిసి రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబానికి రూ.58,800 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాజేందర్ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వడ్డలింగాపూర్ గ్రామ ఉపసర్పంచ్ భూక్యా శంకర్, భూపతిపూర్ వార్డ్ మెంబర్ నాలువల రాము, నాయకులు ఈదుల లక్ష్మణ్, నాగుల రాజేశం, తాట్లవాయి వార్డ్ మెంబర్ పాలేపు సురేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, గ్రామస్థులు, ఎన్ఆర్ఐ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే కార్మికుల భద్రతపై ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపాలని, ఇలాంటి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని పాల్గొన్న నాయకులు కోరారు.

### వార్డుల అభివృద్ధే ప్రధాన లక్ష్యం మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి



**నవగీతం, జూన్24,జగిత్యాల/ధర్మపురి** ధర్మపురి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి గారు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని 1వ వార్డులో రూ.17 లక్షల నిధులతో మంజూరైన డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి, పారిశుద్ధ్య సదుపాయాలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు కూడా పరిష్కారమవుతాయని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ , వైస్ ఛైర్మెన్ ఇందారపు రామన్న , కౌన్సిలర్లు అయ్యోరి వేణుగోపాల్ , ముదుసుల ప్రశాంత్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు ప్రజలు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అంగన్వాడి చిన్నారులకు యూనిఫాంలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ.



**నవగీతం, జూన్24,జగిత్యాల/ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని 5వ వార్డు అంగన్వాడి పాఠశాలలో చిన్నారులకు యూనిఫాంలు మరియు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అవసరమైన సౌకర్యాలు, విద్యా సామగ్రి అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చిన్నారులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అంగన్వాడి చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేయడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం లభిస్తుందని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించడం వల్ల కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### కొండగట్టు అంజనేయ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం



**నవగీతం,జూన్24,(కొడిమ్యాల ప్రతినిధి):** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కూకట్‌పల్లి వాస్తవ్యులు, భక్తుడు శ్రీరంగ ధ్రువన్ పొన్నాల రూ.1 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డికి విరాళ చెక్కును అందించారు.స్వామివారి అపార కృపతో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తూ, వేలాది మంది భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందించే పవిత్ర నిత్యాన్నదాన కార్యక్రమానికి తన వంతు సహకారంగా ఈ విరాళాన్ని సమర్పించినట్లు రంగ ధ్రువన్ పొన్నాల తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి. ఎస్. అంజనారెడ్డి మాట్లాడుతూ, కొండగట్టు అంజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సేవకు భక్తులు అందిస్తున్న విరాళాలు ఎంతో ప్రోత్సాహకరమని అన్నారు.భక్తుల సహకారంతో ప్రతిరోజూ ఆలయానికి వచ్చే వేలాది మందికి అన్నప్రసాదం అందిస్తున్నామని పేర్కొన్నారు.దాతకు ఆలయ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి ప్రసాదం,ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### స్థాయిలో స్వచ్ఛ ఒ హరిత విద్యాలయం అవార్డుకు ఎంపికైన

# పీఎం శ్రీ బీర్పూర్ ప్రాథమిక పాఠశాల.

### ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ ను అభినందించిన జిల్లా విద్యాధికారి.



**నవగీతం, జూన్24,జగిత్యాల/బీర్పూర్** బీర్పూర్ మండలానికి చెందిన పీఎం శ్రీ బీర్పూర్ ప్రాథమిక పాఠశాల జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయం (ఎస్‌హెచ్‌వీఆర్) అవార్డుకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమైంది. తెలంగాణ రాష్ట్రం నుంచి 10 జిల్లాలు ఈ అవార్డుకు ఎంపిక కాగా, జగిత్యాల జిల్లా నుంచి బీర్పూర్ ప్రాథమిక పాఠశాల ఈ ఘనత సాధించింది.
పాఠశాలలో సానిటేషన్, సోలార్ సిస్టమ్, మధ్యాహ్న భోజనం కోసం కిచెన్ గార్డెన్, పూల తోటలు, వర్షపు నీటి సంరక్షణ, విద్యార్థుల హ్యాండ్‌వాష్ సదుపాయాలు, టాయిలెట్ల పరిశుభ్రత, తడి-పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, ఆర్వో సురక్షిత త్రాగునీరు, త్రాగునీటి పరీక్ష సర్టిఫికెట్, ఇంకుడు గుంతలు, తరగతి వారీగా డస్ట్‌బిన్లు, ఈకో క్లబ్ కార్యకలాపాలు, హరితహారం వంటి పలు కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం ఈ అవార్డుకు దోహదపడినట్లు అధికారులు తెలిపారు."ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో పాల్గొన్న 100 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం, పరిశుభ్రతపై విద్యార్థులలో అవగాహన పెంపొందించడం, ప్రవర్తనలో మార్పులు తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అధికారులు పాఠశాలను సందర్శించి ఆరు అంశాలపై మూల్యాంకనం నిర్వహించగా, అన్ని ప్రమాణాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పాఠశాల 91.7 శాతం అర్హత సాధించి జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మరియు జిల్లా విద్యాధికారి కె. రాములను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను బహుమతిగా అందజేశారు. పాఠశాలకు జాతీయ స్థాయిలో అవార్డు రావడానికి అహర్నిశలు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్‌ను కలెక్టర్, డీఈఓ ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సహించారు. ఈ అవార్డు ద్వారా పాఠశాలకు మరింత బాధ్యతలు పెరిగాయని, విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, కోరుట్ల మహేష్, చిప్ప సత్యనారాయణ, సంతోష్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, నాగరాణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.
అలాగే మండల విద్యాధికారి సిరుపు నాగభూషణం, గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉపసర్పంచ్ జితేందర్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల శ్రీలత, గ్రామస్తులు మరియు సహచర ఉపాధ్యాయులు పాఠశాల సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

### ధర్మపురిలో డిగ్రీ కళాశాల నిర్మాణంకై రూ.10 కోట్ల నిధులతో

# హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చేయూత

**ఫలించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కృషి**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, హెచ్ ఏ ఎల్ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ, ప్రతినిధులు యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందంపై సంతకాలు**



**నవగీతం, జూన్24,(జగిత్యాల ప్రతినిధి):** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నత విద్యా అవకాశాల విస్తరణకు మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ.10 కోట్ల వ్యయంతో ధర్మపురిలో నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ముందుకు వచ్చింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ ఫలితంగా బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హెచ్ ఏ ఎల్ ప్రతినిధులు జగిత్యాల జిల్లా యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, హెచ్ ఏ ఎల్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఎ.వి. మురళీకృష్ణ, డీజీఎం (హెచ్‌ఆర్) సూర్యకాంత్ రౌత్, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) ఎస్. సత్యనారాయణ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధే సమాజ అభ్యున్నతికి మూలాధారమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా మౌలిక వసతుల కల్పన ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చని పేర్కొన్నారు.
ధర్మపురి, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ఈ డిగ్రీ కళాశాల వరంగా మారనుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుందని అన్నారు.
నూతన కళాశాల భవనం ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలతో నిర్మించబడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ యువతలో ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. సి ఎస్ ఆర్ నిధులను సామాజికాభివృద్ధికి వినియోగిస్తూ విద్యా రంగానికి హెచ్ ఏ ఎల్ సంస్థ అందిస్తున్న సహకారం ఆదర్శప్రాయమని పేర్కొంటూ, హెచ్ ఏ ఎల్ చైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ శ కె. రవి, యాక్సెసరీస్ కాంప్లెక్స్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఎం. సత్యనారాయణ, హెచ్ ఏ ఎల్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామమోహనరావు, హెచ్ ఏ ఎల్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఏ.వి. మురళీకృష్ణతో పాటు హెచ్ ఏ ఎల్ యాజమాన్యానికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ధర్మపురి ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సి ఎస్ ఆర్ నిధుల కింద ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సహకరించిన హెచ్ ఏ ఎల్ సంస్థ ప్రతినిధులను మంత్రి ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, మంత్రి ఓఎస్డీ వై.జె. విజయ్ కుమార్, జిల్లా అధికారులు, హెచ్ ఏ ఎల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డిబి కాలనీలో ఘనంగా

## చిన్నారి ఓణీల అలంకరణ వేడుక:

**హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**



**నవగీతం,జూన్24, (తల్లాడ ప్రతినిధి):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీ పరిధిలోని డిబి కాలనీలో బుధవారం ఓణీల అలంకరణ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. కాలనీకి చెందిన నారపోగు ప్రభాకర్ - శిరీష దంపతుల ఏకైక కుమార్తె మమత ఓణీల అలంకరణ (హాఫ్ శారీ) వేడుకను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు.?ఈ శుభకార్యానికి జక్కంపూడి ప్రధాన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకకు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కంపూడి చంద్రశేఖర్, సామినేని రామప్పరావు, జక్కంపూడి రమేష్, బిల్లుపాడు సర్పంచ్ ఎనిక నరసింహారావు, అలాగే ప్రముఖ నాయకులు రాయల లక్ష్మయ్య, ఇంజన్ ఐనర్సరావు, బేగ్ అల్లిబాబు, ఎస్కే నాగులు మీరా, పటాన్ ముసాకాన్ తదితరులు చిన్నారి మమతకు అక్షింతలు వేసి, దీవెనలు అందజేశారు.?చిన్నారి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్థానిక కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ప్రభుత్వ ఉద్యోగులు..

**రైతుల పడిగాపులు**



**నవగీతం,జూన్24,(తల్లాడ ప్రతినిధి):** తల్లాడ మండల కేంద్రంలోని ఇరిగేషన్ సబ్ డివిజన్ నెం.3 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో అధికారుల సమయపాలనపై రైతులు, ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10:30 గంటలు దాటినా కార్యాలయంలో పలువురు ఉద్యోగుల కుర్చీలు ఖాళీగా కనిపించడంతో పనుల కోసం వచ్చిన రైతులు, కాంట్రాక్టర్లు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సాగునీటి సమస్యలు, కాలువల మరమ్మతులు, బిల్లుల చెల్లింపులు తదితర పనుల కోసం వచ్చిన వారికి అధికారులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సమయం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఉన్నప్పటికీ కొందరు ఉద్యోగులు 11 గంటల తర్వాతే కార్యాలయానికి వస్తున్నారని, మధ్యాహ్నం అనంతరం కూడా విధులకు సకాలంలో హాజరు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న వేళ కాలువల నిర్వహణ, తూముల మరమ్మతులు, నీటి విడుదల వంటి అంశాల్లో స్పష్టత లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక సంతకం కోసం కూడా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. తల్లాడ ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉద్యోగుల హాజరుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## కొరటపెల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభించిన సర్పంచ్



**నవగీతం,జూన్24,(కొడిమ్యాల ప్రతినిధి):** రామడుగు మండలంలోని కొరటపెల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్‌జీఆర్‌ఎస్ నిధుల ద్వారా గ్రామాభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేయించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆమె, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు సాధించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. కొరటపెల్లి గ్రామాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్‌జీఆర్‌ఎస్ నిధుల కేటాయింపుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## సురభి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం





**నవగీతం, జూన్24,(కోరుట్ల ప్రతినిధి):** కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ గ్రామ ప్రజల కోరిక మేరకు వారి దాహార్తిని తీర్చేందుకై సురభి ఫౌండేషన్ ద్వారా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. వారితోపాటు గ్రామ సర్పంచ్ పల్లి రాణి రాజు,ఉపసర్పంచ్ బాసవేణి రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పృథ్వీ, వార్డ్ సభ్యులు,గోపు వసంత,కసవత్రి కళ్యాణ్,పల్లి శేఖర్,గోపు నక్షత్ర మధు,చొప్పరి పద్మ గంగాధర్,చొప్పరి లక్ష్మి నారాయణ ,ప్రణీత్,రవి,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ తుకారాం గౌడ్ ,సత్యనారాయణ, శంకర్,తుక్కయ్య, బిజెపి కోరుట్ల మండల అధ్యక్షులు పంచరి విజయ్,కోరుట్ల మండల బిజెపి ప్రధాన కార్యదర్శి గోపు ప్రశాంత్,ఉపాధ్యక్షులు భూమానందం బూత్ అధ్యక్షులు లక్ష్మణ్,బిజెపి నాయకులు బ్రహ్మయ్య ,శిరీష్,మల్లేశం, విష్ణు, నాగరాజు, సుధాకర్, శివ,వీడీసీ అధ్యక్షులు లింబాద్రి ,దేవాదాయ శాఖ అధ్యక్షులు మరిపెల్లి శంకర్,బిజెపి,బిజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారంగా మలిచి పుస్తకాలు యూనిఫామ్ ఇతర విద్యా సామగ్రిని పాఠశాలలో అమ్మినట్లయితే కఠిన చర్యలు

**మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు**

**నవగీతం,జూన్24,(రాయికల్ ప్రతినిధి)** రాయికల్ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు మరియు ఇతర విద్యా సామగ్రిని విక్రయించడం మరియు తల్లిదండ్రులను నిర్దిష్ట పుస్తకాలు లేదా వస్తువులు కొనుగోలు చేయాలని బలవంతపరచడం నిబంధనలకు విరుద్ధమని తెలియజేయడమైనది. అదేవిధంగా,పాఠశాల వాహనాలలో నిర్దేశిత సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించ కూడదని ,విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులు మరియు ఇతర వాహనాలలో అనుమతించబడిన పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. అందువల్ల రాయికల్ మండల పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల ప్రాంగణంలో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు మరియు ఇతర వస్తువుల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని,అలాగే పాఠశాల వాహనాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను తరలించకుండా రవాణా శాఖ మరియు విద్యాశాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించడమైనది. నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత పాఠశాలలపై శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడమైనది.

## తెలంగాణలో హిట్లర్ పాలన

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రైతుబంధు చెల్లింపులు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల అంశాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. భూ సమస్యలను

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
25 జూన్ 2026

## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

### -వైరా ఎస్సై రామారావు



**నవగీతం,జూన్24,(వైరాప్రతినిధి):** మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైరా ఎస్సై రామారావు పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం బుధవారం వైరా లోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల ఎన్నో అందమైన జీవితాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి, ఉజ్వల భవిష్యత్తుకు విద్య పునాది అని, చదువుపై దృష్టి పెట్టడం ద్వారా నైపుణ్యాలు పెంపొందడమే కాక, సమాజంలో మంచి గుర్తింపు, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఏకాగ్రత, క్రమశిక్షణతో చదవడం విజయానికి మార్గమని సూచించారు.అనంతరం మాదకద్రవ్యాలపై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

## రాయదుర్గం భూములపై వెనక్కి తగ్గిన ఎస్ బీఐ

**హైదరాబాద్ :** గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య చర్చనీయాంశంగా మారిన రాయదుర్గం భూవివాదం పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరు వర్గాల మధ్య జరిగిన వరుస చర్చల తర్వాత ఉద్రిక్తతలు తగ్గినట్లు సమాచారం. తాజాగా ఎస్‌బీఐ తీసుకున్న నిర్ణయాలతో ఈ వ్యవహారం త్వరలోనే ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎస్‌బీఐ సానుకూలంగా స్పందించింది. ఈ భూముల వ్యవహారానికి సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి బ్యాంక్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వివాదాస్పద భూమికి బదులుగా ప్రభుత్వం సూచించిన 2.5 ఎకరాల ప్రత్యామ్నాయ స్థలాన్ని స్వీకరించేందుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) అధికారులు, ఎస్‌బీఐ ప్రతినిధుల మధ్య మరోసారి సమావేశం జరగనుంది. ఈ భేటీలో మిగిలిన అంశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చర్చలు సానుకూలంగా ముగిస్తే భూ వివాదానికి పూర్తిస్థాయిలో తెరపడే అవకాశం ఉంది.ఇక ఈ వివాదం కారణంగా ఎస్‌బీఐపై తెలంగాణ ప్రభుత్వం గతంలో కఠిన వైఖరి అవలంబించింది. ప్రభుత్వ శాఖలకు చెందిన పలు లావాదేవీల విషయంలో పరిమితులు విధిస్తూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ, ఆర్థిక వర్గాల్లో కూడా చర్చకు దారితీసింది.అయితే ఇప్పుడు పరిస్థితి మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎస్‌బీఐ వైఖరిలో మార్పు రావడంతో ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. బ్యాంక్‌తో కొనసాగుతున్న ప్రభుత్వ లావాదేవీలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్ల నిర్వహణతో పాటు ఎస్‌బీఐకి ఉన్న లీడ్ బ్యాంక్ హోదాను కూడా కొనసాగించే అవకాశాలు ఉన్నాయి.హైకోర్టులో తదుపరి విచారణ పూర్తయిన తర్వాత ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అప్పటివరకు ఇరు పక్షాలు చర్చల ప్రక్రియను కొనసాగించే అవకాశముంది.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### పోలీస్ కమిషనరేట్ అవగాహన సదస్సు

**కరీంనగర్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో దుర్శేడ్ జిల్లా పరిషద్ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాల దుర్వినియోగంకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసారు.?ముఖ్యమైన అంశాలు:?అన్ని ప్రాంతాల్లో అవగాహన..కరీంనగర్ లోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలోనూ ఈ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు సీపీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపారు.?యువతపై ప్రత్యేక దృష్టి: భవిష్యత్తు తరాలైన యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు పోలీసు శాఖ నిరంతరం అవసరమైన చర్యలు చేపడుతుందని సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, యాంటీ నార్కోటిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ స్థానిక కార్పొరేటర్ రవీందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెడ్ మాస్టర్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు నైపుణ్యాల ప్రదర్శనకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదిక

### జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్2026 ప్రారంభించిన అదనపు ఎస్పీ చంద్రయ్య

**రాజన్న సిరిసిల్ల :** పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తి నైపుణ్యం అత్యంత అవసరమని, నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం లో నిర్వహిస్తున్న జిల్లా 3వ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్?2026 కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ ప్రారంభించారు ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ....పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.నేరస్థులను శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ ద్వారా పోలీసు అదికారులు సిబ్బంది తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, అనుభవాలను పంచుకోవడానికి, వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునేందుకు చక్కటి వేదిక అని అన్నారు. ఈడ్యూటీ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్,యాంటీ-సబోటేజ్ చెకింగ్, మరియు కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడుతున్నాయన్నారువివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు,సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అదేవిధంగా జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు లభిస్తుందని, రాష్ట్రాలు మరియు ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, సహకారం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు,సి.ఐ రవి, నాగేశ్వరరావు, రవిందర్, వెంకటేష్, ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ లు, ఆర్.ఐ.ఎస్ లు,సిబ్బంది

# గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఆయిల్ పామ్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం**



**నవగీతం,జూన్24(ఖమ్మం ప్రతినిధి):** జిల్లాలో రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా అంజనాపురంలో నిర్మాణంలో ఉన్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణం, మౌళిక వసతులు, నిర్మాణ పనులు, యంత్రాల ఏర్పాట్లపై సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ...వ్యవసాయ రంగంలో విశేష అనుభవం కలిగిన గోద్రెజ్ సంస్థ ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం రైతాంగానికి ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఫ్యాక్టరీతో పాటు ఆధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారని తెలిపారు. దీంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, సందేహాలు, సమస్యలకు నిపుణుల సలహాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, ఎండల తీవ్రత వంటి సవాళ్లను తట్టుకుని నిలబడగలిగే పంటల్లో ఆయిల్ పామ్ ముఖ్యమైందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ తోటలలో ప్రారంభ మూడు సంవత్సరాల వరకు మిర్చి, మొక్కజొన్న, వరి వంటి అంతర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో స్థిరమైన డిమాండ్ కలిగిన లాభదాయక పంటల వైపు రైతులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలికంగా మంచి ఆదాయం అందించే పంటగా ఆయిల్ పామ్ నిలుస్తోందన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోందని తెలిపారు.గోద్రెజ్ ఫ్యాక్టరీ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే రైతులు పండించిన ఆయిల్ పామ్ గెలలను సమీపంలోనే విక్రయించే అవకాశం లభిస్తుందని, రవాణా వ్యయాలు తగ్గడంతో పాటు రైతులకు మరింత లాభం చేకూరుతుందని చెప్పారు.ఫ్యాక్టరీ వద్దకు అవసరమైన రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్, ఇతర మౌళిక సదుపాయాలు సకాలంలో అందుబాటులోకి వచ్చేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందని తెలిపారు.గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ జిల్లాలో వ్యవసాయ ఆధారిత పారిశ్రామికాభివృద్ధికి నాంది పలుకుతుందని, జిల్లా రైతాంగానికి ఉపాధి, ఆదాయ వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా జిల్లా పరిపాలన తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలోకలెక్టర్ వెంట కొణిజర్ల తహసీల్దార్ అరుణ, ప్రాజెక్ట్ డీజీఎం, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

## డూప్లికేట్ ఓటర్ల గుర్తింపునకు ఈఆర్వో నెట్ ద్వారా ప్రత్యేక పరిశీలన




**నవగీతం,జూన్24,(ఖమ్మం ప్రతినిధి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) శిక్షణలు నిర్వహించడంతో పాటు అవసరమైన పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారంలు రెండు అందజేస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం నింపి తిరిగి ఒక ఫారం బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు.ప్రతి ఇంటిని బీఎల్‌వోలు మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయపడతారని, ఇంటింటి సర్వే సమయంలో బీఎల్ఏలు బీఎల్‌వోలతో కలిసి వెళ్లవచ్చని తెలిపారు. బీఎల్‌వోలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించగా, బీఎల్ఏలు తమ రాజకీయ పార్టీలు జారీ చేసిన గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని సూచించారు.విదేశాల్లో, ఇతర నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, సైన్యంలో విధులు నిర్వహిస్తున్న ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని, లేదా వారి కుటుంబ సభ్యులు సంబంధిత బీఎల్‌వోకు వివరాలు అందించవచ్చని తెలిపారు.జూలై 31న ముసాయిదా ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఓటరు పేరు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలపై ఆగస్టు 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలను సెప్టెంబర్ 28, 2026 నాటికి పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో వివరించే ట్యుటోరియల్ వీడియోలను సిద్ధం చేశామని, ఫారాలతో పాటు వివరణాత్మక కరపత్రాలను కూడా అందజేస్తామని తెలిపారు.మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు కూడా తప్పని సరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని స్పష్టం చేశారు. మ్యాపింగ్ అనేది కేవలం ప్రీ-ఎస్ఐఆర్ ప్రక్రియ మాత్రమేనని, ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేయడానికే అది ఉపయోగమని, అది ఫారానికి ప్రత్యామ్నాయం కాదని అన్నారు.2002 ఎస్ఐఆర్ జాబితాలో దేశంలోని ఎక్కడైనా ఓటు నమోదై ఉన్నట్లయితే ఆ వివరాలను ప్రస్తుతం ఇవ్వవచ్చని తెలిపారు. ముఖ్యంగా వివాహానంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలకు ఈ అవకాశం ఉపయోగపడుతుందని అన్నారు.2002 ఎస్ఐఆర్ ఓటు ఆధారంగా ఆరుగురు కుటుంబ సభ్యులను అనుసంధానం చేయవచ్చని వివరించారు.డూప్లికేట్ ఓటర్లను గుర్తించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఒకే పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు వంటి వివరాలతో ఉన్న డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలను గుర్తించి, బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ తాజా సమాచారం అందిస్తున్నామని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సందేహానికి సమాధానం ఇవ్వబడుతుందని తెలిపారు.స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఇది ఎనిమిదవ ఎస్ఐఆర్ కార్యక్రమమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగించి ఓటరు జాబితాను క్లియర్ గా ఉంచేందుకు ఎస్ఐఆర్ ఉపయోగపడుతుందని వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి వివక్ష ఉండదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో ఉండవని స్పష్టంచేశారు.ఫారం సమర్పించిన ఓటరు పేరును నిబంధనల ప్రకారం తొలగించబోమని వెల్లడించారు.లిఅనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివిధ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.ఖ

## ఉద్యోగుల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు మానవతా దృక్పథం..

**మెమో-57 చారిత్రాత్మక నిర్ణయం..**

**హర్షం వ్యక్తం చేసిన చీర్ల కిరణ్**

**అర్హులైన టీటీడీ ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ అమలు చేయాలి..**

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెం.57 ద్వారా అర్హులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఒపీఎస్ ) వర్తింపజేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న మానవతా దృక్పథానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ అమలుకు ముందు నియామక ప్రక్రియ పూర్తయి, పరిపాలనా కారణాల వల్ల ఆలస్యంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ)లో కూడా మేనేజ్‌మెంట్ పరమైన ఆలస్యాల కారణంగా 2004లో ఉద్యోగాలు పొందాల్సిన అనేక మంది అభ్యర్థులకు 2005లో నియామకాలు లభించాయని, దీంతో వారు పాత పెన్షన్ విధానానికి అర్హులైనా కొత్త పెన్షన్ విధానం (సిపిస్ ) పరిధిలోకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. మెమో-57 స్ఫూర్తిని కొనసాగిస్తూ, టీటీడీలో మేనేజ్‌మెంట్ ఆలస్యం వల్ల అన్యాయానికి గురైన అర్హులైన ఉద్యోగుల

## మంగళంలో మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం


**చేతివృత్తులతోనే ఆర్థికాభివృద్ధి...**

**మహిళలు ఆర్థికంగా ఎదగాలి: '**

**రాస్' డైరెక్టర్ వి. నాగరాజు..**

**రేణిగుంట :** రాస్ జన శిక్షణ సంస్థాన్,తిరుపతి వారి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం మంగళం నందు మహిళలకు మగ్గం వర్క్ (ఆర్య వర్క్) పై మూడు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ డైరెక్టర్ వి.నాగరాజు మరియు జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ బి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వి.నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు నేర్చుకుని అభివృద్ధి చెందాలని తెలియజేశారు. నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పనిచేస్తూ ముందుకు సాగాలని తెలిపారు. అంతే కాకుండా జన శిక్షణ సంస్థాన్ నిర్వహించే వివిధ రకాల చేతి వృత్తుల పై శిక్షణ తీసుకోవాలని కోరారు. తరువాత బి . సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చేతివృత్తులతోపాటు ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని. అలాగే రాస్ నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వర్క్ నేర్చుకోవడానికి వచ్చినటువంటి మహిళలందరికీ ఉచితంగా ముడి సరుకుని అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ ఫీల్డ్ ఆఫీసర్ డి . నాగరాజు ,శ్రీదేవి ,క్లస్టర్ లీడర్లు వెంకటలక్ష్మి, నేర్పించే టీచర్ పి.లావణ్య మరియు 40 మంది మహిళలు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
25 జూన్ 2026



## 'మాట్లాడినా తప్పే, మౌనంగా ఉన్నా తప్పే'.. ట్రోలింగ్‌పై రజినీకాంత్ అసహనం!

తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అసహనం వ్యక్తం చేశాడు నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. తాజాగా చెన్నైలో జరిగిన 'ధర్మన్' సినిమా లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బహిరంగంగా మాట్లాడాలంటే ఇప్పుడు భయంగా ఉందని చెప్పారు. తాను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే అవుతోందని రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపైకి మాట్లాడమని పిలిస్తే భయంగా ఉందని, ఎందుకంటే తాను మాట్లాడితే అది తనకు కాకపోయినా మీకు సమస్య అవుతుందని ఆయన అన్నారు. ఒకవేళ మౌనంగా ఉంటే మౌనంగా ఎందుకు ఉన్నాడు అని ఎగతాళి చేస్తారని చెప్పారు. అదే మాట్లాడితే ఇప్పుడు ఎందుకు మాట్లాడాడు, అసలు మాట్లాడకుండా ఉండాల్సింది అని విమర్శిస్తారని తెలిపారు.వీశీజఱవం ఇక చాలా ఏళ్ల తర్వాత తనకు ఒక విషయం అర్థమైందని, మనల్ని ఇష్టపడని వాళ్లకు మనం ఏం చేసినా నచ్చదని, ఇష్టపడేవాళ్లు మనం ఏం చేసినా నచ్చుతుందని అనుకోవడం మూర్ఖత్వమని రజినీ అన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మెచ్చుకుంటారని ఆశించడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రజినీకాంత్ 'ధర్మన్' చిత్ర షూటింగ్ గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తుండగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నాడు.






## బోనీ కపూర్ ఇంట పెళ్లి సందడి.. జాన్వీ అక్క వెడ్డింగ్ వేడుకలు ప్రారంభం

బాలీవుడ్‌లో మరో స్టార్ వెడ్డింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుటుంబంలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఆయన పెద్ద కుమార్తె అన్షులా కపూర్ వివాహ వేడుకలు ముంబైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తన లాంగ్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ రోహన్ థక్కర్‌తో అన్షులా త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనుండగా, ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య సందడిగా సాగుతున్నాయి.గత ఏడాది న్యూయార్క్‌లో సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న అన్షులా–రోహన్ జంట ఇప్పుడు జూలై 6న పెళ్లి పీటలెక్కబోతోంది. దీంతో కపూర్ కుటుంబంలో ఇప్పటికే పెళ్లి సందడి మొదలైంది. ఈ వివాహ వేడుకల తొలి కార్యక్రమంగా ముంబైలో సంప్రదాయబద్ధంగా 'మాతా కీ చౌకీ' పూజను నిర్వహించారు. వరుడు రోహన్ థక్కర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను అన్షులా సోషల్ మీడియాలో పంచుకుంటూ, "ప్రేమ, కుటుంబం, దేవుని ఆశీస్సులతో మా కొత్త ప్రయాణం ప్రారంభమవుతోంది" అంటూ భావోద్వేగ పోస్ట్ చేసింది.అన్షులా పెళ్లి వేడుకల్లో అన్నయ్య అర్జున్ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. తల్లి మోనా శౌరీ కపూర్ మరణం తర్వాత అన్షులాకు అర్జున్ కపూరే అండగా నిలిచారు. చెల్లెలి బాధ్యతలను తన భుజాలపై వేసుకుని కుటుంబానికి పెద్దగా వ్యవహరించిన అర్జున్, ఇప్పుడు ఆమె పెళ్లి ఏర్పాట్లను కూడా దగ్గరుండి చూసుకుంటున్నారు. ఒకప్పుడు బోనీ కపూర్ రెండో భార్య శ్రీదేవి కుమార్తెలైన జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లతో అర్జున్, అన్షులాల మధ్య పెద్దగా అనుబంధం లేదనే వార్తలు వినిపించేవి. అయితే శ్రీదేవి మరణం తర్వాత ఈ నలుగురు తోబుట్టువులు మరింత దగ్గరయ్యారు. ఇప్పుడు అన్షులా పెళ్లి వేడుకల్లో ఆ అనుబంధం స్పష్టంగా కనిపిస్తోంది.జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లు పెళ్లి ఏర్పాట్లలో చురుకుగా పాల్గొంటూ అక్కకు అండగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేస్తూ, డాన్స్‌లు చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా మారారు. సోనమ్ కపూర్, రియా కపూర్‌లతో కలిసి ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డిన్నర్ వేడుకకు సంజయ్ కపూర్, మహీప్ కపూర్‌తో పాటు కపూర్ కుటుంబ సభ్యులందరూ హాజరయ్యారు. బాలీవుడ్ నెక్స్ట్ జనరేషన్ సెలబ్రిటీలు కూడా ఈ వేడుకల్లో సందడి చేశారు.

## 'వారణాసి' షూట్‌కు బ్రేక్ ఇచ్చిన మహేష్ బాబు... జూలై నుంచి మళ్లీ సెట్స్‌లోకి!



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు తాజాగా చిన్న విరామం తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. రీసెంట్‌గా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహేష్ బాబు తన భార్య నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితారలతో కలిసి కనిపించారు. ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబంతో కలిసి కనిపించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వారణాసి' షూటింగ్‌కు మహేష్ బాబు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు స్పష్టమైంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, మహేష్ బాబు జూలై 1, 2026 నుంచి మళ్లీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. వరుసగా నెలల తరబడి షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం కుటుంబంతో కొంత సమయం గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు పాత్రల గురించి వస్తున్న వార్తలు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సినిమాలో ఆయన 'రుద్ర' పాత్రలో కనిపించడమే కాకుండా, శ్రీరాముడి పాత్రలో కూడా ద్విపాత్రాభినయం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్లు, అడ్వెంచర్ సన్నివేశాలు సినిమా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక ఈ చిత్రంలో 'మందాకిని' పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కె.ఎల్. నారాయణ నిర్మిస్తుండగా, ఎస్ఎస్ కార్తికేయ కూడా నిర్మాణ బాధ్యతల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. సుమారు రూ.1300 కోట్లకు పైగా బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి స్వరాలు సమకూరుస్తుండగా, కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు దేవా కట్టా సంభాషణలు రాస్తున్నారు. రాజమౌళి విజన్‌కు అనుగుణంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ముఖ్యంగా ఈ చిత్రాన్ని పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం.

## రూ.100 కోట్లతో రాపో23

### రామ్ పోతినేని పాన్ ఇండియా ప్లాన్, టాప్ టీమ్ ఫిక్స్!

యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రాపో23 చిత్రం తెరకెక్కబోతున్నట్లు సమాచారం. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ పోతినేని ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా నిర్మిస్తున్నారు. రామ్ ఇమేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లేలా ఈ ప్రాజెక్ట్‌ను అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ స్కేల్‌లో ప్లాన్ చేశారు. ఇప్పటివరకు రామ్ కెరీర్‌లో చేయని విధంగా యాక్షన్, ఎమోషన్, గ్రాండియర్ కలబోసిన కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం కోసం ఏకంగా రూ.100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలుస్తుంది. దీంతో టాలీవుడ్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాల్లో ఒకటిగా రాపో23 నిలవనుంది. బడ్జెట్‌కే తగ్గట్టుగా ఈ సినిమా కోసం ఇండియన్ సినిమాలోని టాప్ టెక్నీషియన్స్‌ను రంగంలోకి దించబోతున్నారు. నేషనల్ అవార్డు గ్రహీత, స్టార్ సినిమాటోగ్రాఫర్ తిరు ఈ చిత్రానికి విజువల్స్ అందిస్తుండగా, హాలీవుడ్ రేంజ్ యాక్షన్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన పీటర్ హెయిన్ హై వోల్టేజ్ ఫైట్ సీక్వెన్స్‌లను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే పీటర్ హెయిన్ టీమ్‌తో భారీ యాక్షన్ బ్లాక్స్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయి. ఇక ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శివార్లలో భారీ సెట్స్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఒక సిటీ సెట్‌తో పాటు కీలకమైన యాక్షన్ ఎపిసోడ్స్ కోసం స్పెషల్ సెట్స్ వేస్తున్నారు. కళ్లు చెదిరే యాక్షన్ ఎపిసోడ్స్, రిచ్ ప్రొడక్షన్ డిజైన్, వరల్డ్ క్లాస్ టెక్నీషియన్స్ కలయికలో వస్తున్న రాపో23 రామ్ పోతినేని కెరీర్‌లో గేమ్ ఛేంజర్ అవుతుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటులు, హీరోయిన్, మ్యూజిక్ డైరెక్టర్ వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉండగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది.



## 'ఛావా' దర్శకుడి కొత్త ప్రయోగం.. శ్రద్ధ కపూర్ 'ఈత' టీజర్ విడుదల!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచుకుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.



Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.